RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 273 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం, ఏప్రిల్,28, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 273 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday, April, 28, 2026 | PAGES : 8 RS : 4 /- |




## అమెరికా అధ్యక్షుడిపై.. కాల్పుల ఘటన

**ఉలిక్కి పడేలా చేసిన వ్యక్తి**
**ట్రంప్‌పై వ్యతిరేతతోనే దాడికి యత్నం**

వాషింగ్టన్,:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న శ్వేతసౌధం కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పుల ఘటన నిందితుడు కోల్ టొమాస్ అలెన్ గురించి కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. అతడు ట్రంప్‌న కు వ్యతిరేకంగా దాడికి ముందే ఓ నోట్‌ను తయారుచేసి, దానిని కుటుంబసభ్యులకు పంపాడు. ట్రంప్ గురించి....పిల్లలను లైంగికంగా వేధించే వ్యక్తి, రేపిస్ట్, ద్రోహి వంటి పదాలను అందులో వాడాడని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అలాంటి లక్షణాలు న్న వ్యక్తిని ఏమాత్రం అంగీకరించను అని ఆ నోట్‌లో నిందితుడు రాసుకున్నాడు. అలాగే తాను ఎవరిని టార్గెట్ చేయాలను కున్నాడో ఒక జాబితాను సిద్ధం చేసుకున్నాడు. తన జోలికి రానంతవరకు అతిథులు, ఇతర సిబ్బందిని, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లపైనా కాల్పులు జరపనని పేర్కొన్నాడు.



## ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణం

**ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా**
**హాజరైన సిఎం రేవంత్ తదిరులు**



హైదరాబాద్,తెలంగాణ దిశ : ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజా రుద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువు రు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండ రాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమి స్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరి పాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.



## దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రత..

- నాగ్‌పూర్, విదర్భలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు
- దేశంలోని అన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సూచన

డిల్లీ: మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో దేశంలోనే అత్యధికంగా 46.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగ్‌పూర్, విదర్భలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు వీచాయి. ఈ సంవత్సరం మార్చి నెల నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఈ ఏప్రిల్ నెలలో ఉష్ణోగ్రతలు దాదాపు అన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటాయి. దీనితో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే

## కాంగ్రెస్, బీజేపీ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పిస్తాం

**ఢిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్‌ఎస్ అన్న కేటీఆర్**



- పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను అగ్రభాగన నిలపెట్టారని ఉద్ఘాటన
- ప్రజలు ఇచ్చిన పాత్రను బీఆర్ఎస్ సమర్థవంతంగా పోషిస్తోందని వ్యాఖ్యలు

హైదరాబాద్: కాంగ్రెస్, బీజేపీ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి మళ్లీ బీఆర్‌ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అడుగడుగునా పోరాటాలు చేస్తూ ఢిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టారని అన్నారు.



## బెంగాల్ ప్రచారం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది

**బిజెపి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలంతా కలసి రావాలి**
**బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ**

న్యూఢిల్లీ, : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారానికి సోమవారం సాయంత్రం తెరపడటం తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో తాను జరిపిన విస్తృత పర్య టన రాజకీయంగా, ఆధ్యాత్మిక ఎదు గుదల పరంగా తనకెంతో ఉపకరిం చిందని ఆ లేఖలో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్రాభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను రాష్ట్ర ప్రజల ముందు ఉంచానని, అయిన ప్ప టికీ ఈ లేఖ ద్వారా తన మనోభా వాలని రాష్ట్ర ప్రజలందరి తోనూ పం చుకోవాలని అనుకుంటు న్నానని చె ప్పారు. బెంగాల్ సోదర, సోదరీమణు ల్లారా అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. ఎన్ని కల ప్రచారం లో అసాధారణ శక్తిని తాను అనుభూ తి పొందానని, తీవ్ర మైన వేడి, వరుస ర్యాలీల్లో పాల్గొన్న ప్పటికీ తనకెలాంటి అలసట రాలేదని చెప్పారు. మా కాళి భక్తుల తో కలిసి నేను ఎప్పుడు వెళ్లినా ఆ తల్లి నాలో రెట్టించిన శక్తిని నింపుతు న్నట్టు అనిపిస్తుంది. 2024 జనవరి లో అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాప న జరిగిన 11 రోజులు ఉపవాసం చేశాను. అప్పటిలాగా బెంగాల్ ప్రచా రంలో కూడా అలాంటి ఆధ్యాత్మిక అనుభూతే నాకుకలిగింది' అని మోదీ వెల్లడించారు. బెంగాల్‌లో పాల్గొన్న ర్యాలీలు, రోడ్‌షోలలో ప్రజల నుంచి హృదయాన్ని కదలించే..

## మెదక్ జిల్లాలో ట్రావెల్ బస్సు దగ్ధం



ఘటనపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు


**హైదరాబాద్,తెలంగాణ దిశ:**మెదక్ జిల్లాలోని మాసాయిపేట వద్ద ఎన్ హెచ్ –44పై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. ఈ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగింది. అదృష్టవ శాత్తూ డ్రైవర్, క్లీనర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో సాంకేతిక సమస్య తలెత్తడంతో, దానిని రిపేర్ చేయించడం కోసం హైదరాబాద్ నుంచి మెదక్ తీసుకువచ్చారు. రిపేర్ పనులు పూర్తయిన తర్వాత సోమవారం తెల్లవారుజామున డ్రైవర్, క్లీనర్ బస్సును తీసుకుని తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు.

## తేజస్వి సూర్య ఓ వెధవ..

**తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాక్ విభజనతో పోల్చడంపై కేసీఆర్ ఫైర్**



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుప కుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు..రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్‌ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉ ండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు.



## కోర్టుపై తనకు నమ్మకం పోయింది

**అందుకే మీరు ఉన్నంత వరకు హాజరు కాను**
**ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు**
**ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్**

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ అనూ హ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకా వడానికి ఆయన నిరాకరించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ, కోర్టుపై తనకు 'నమ్మకం పోయిం దని' సంచలన వ్యాఖ్యలు చేశారు.

# జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి -- టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్

## - కొత్త కమిషనర్‌కు పాత సమస్యల పత్రం సమర్పణ



**హైదరాబాద్, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** :రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ నూతన స్పెషల్ కమిషనర్ జి. ముకుందరెడ్డిని కోరారు. సోమవారం మాసాబ్ ట్యాంక్‌లోని సమాచార భవన్‌లో కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలుపుతూ జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ పట్ల గత రెండేళ్లుగా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనల బిల్లులు రెండు సంవత్సరాలుగా చెల్లించకపోవడం వల్ల ప్రచురణకర్తలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదే విధంగా పత్రికల ఎంపానల్మెంట్ ప్రక్రియను సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచడం, ఆర్ఎన్ఐ, పీఆర్‌జీఐ అనుమతులతో నడుస్తున్న పత్రికలకు ప్రకటనలు ఇవ్వకపోవడం, అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయకపోవడం వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ వంటి హామీలు అమలు కాలేదని పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన జీవో 252 ప్రకారం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇంకా జారీ కాకపోవడం ఆందోళనకరమని, పాత కార్డులను తాత్కాలికంగా పొడిగించడం మాత్రమే జరుగుతోందని తెలిపారు. కేబుల్ టీవీ ఛానళ్లకు అక్రెడిటేషన్ విషయంలో స్పష్టత ఇవ్వాలని, పాత విధానాన్ని కొనసాగించేలా జీవోను సవరించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి కనీసం రూ.100 కోట్లు కేటాయించాలని, చిన్న, మధ్య తరహా పత్రికలకు పెండింగ్‌లో ఉన్న ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని, ఎంపానల్మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అందరికీ అక్రెడిటేషన్ మరియు హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. రవికుమార్, కో-కన్వీనర్ ఆర్. శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు గోవింద్, రవి కుమార్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడలో హత్యాయత్నం కేసు ఛేదించిన పోలీసులు

## - ఇద్దరు నిందితులు అరెస్ట్



**కుషాయిగూడ, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించి ప్రధాన నిందితుడు సహా ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి నివాసి పాశం శ్రీనివాస్ (53), వ్యాపారిపై గతంలో కలిసి పనిచేసిన ఖాజాతో ఆర్థిక లావాదేవీల విషయంలో విభేదాలు తలెత్తాయి. ఈ విభేదాలను మనసులో పెట్టుకున్న ఖాజా శ్రీనివాస్‌ను హతమార్చేందుకు పథకం రచించాడు. ఈ క్రమంలో 24న మధ్యాహ్నం సుమారు 4 గంటల సమయంలో రాధికా క్రాస్ రోడ్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్ వద్ద భోజనం చేస్తున్న శ్రీనివాస్‌పై ఖాజా తన డ్రైవర్ అజ్మద్‌తో కలిసి దాడి చేయడానికి ప్రయత్నించాడు. అయితే ప్రయత్నం విఫలమవడంతో వారు వెంట తెచ్చుకున్న కత్తులను అక్కడే వదిలి పరారయ్యారు. ఘటన స్థలం నుండి పోలీసులు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తులో భాగంగా 26న నిందితులు ఖాజాతో పాటు అతనికి సహకరించిన అజ్మద్‌లను భువనగిరిలో పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రెండు సెల్‌ఫోన్లు, ఒక కారు స్వాధీనం చేసుకుని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మీ అనుభవం, నిబద్ధత రాష్ట్ర అభివృద్ధికి దోహదం

## - గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు ఘనంగా సన్మానం

## - మహిళా కాంగ్రెస్ తెలంగాణ మాజీ అధ్యక్షురాలు మొగిలి సునీత ముదిరాజ్



**హైదరాబాద్, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** : గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేటైన రాష్ట్ర మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరాంలను ఏఐసీసీ సభ్యురాలు, మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, గోషామహల్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మొగిలి సునీత ముదిరాజ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారి నివాసాలలో సునీత ముదిరాజ్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రజా సేవలో వారికున్న అనుభవం, నిబద్ధత రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సునీత ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురికి ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్సీలను అభినం దించారు.

# సాకేత్ టౌన్ షిప్ లో 'ఆక్సికేర్ హాస్పిటల్స్' ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**కాప్రా, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** :కాప్రా డివిజన్ పరిధిలో పరిధిలోని సాకేత్ టౌన్ షిప్ లో ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆక్సికేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రి సిఎండి డాక్టర్ ఎ. చైతన్యరెడ్డి, ఆస్పత్రి సీఈఓ నేత్ర వైద్యులు డాక్టర్ ఎ. శివరేఖ పలువురిని పరీక్షించి ఉచిత మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆక్సికేర్ హాస్పిటల్ యజమాన్యాన్ని అభినందించారు.

# ఐఅండ్‌పీఆర్ కొత్త కమిషనర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ నేతల అభినందనలు



హైదరాబాద్, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ) :రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి. ముకుందరెడ్డికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం మాసాబ్ ట్యాంక్‌లోని సమాచార భవన్‌లో కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. రవికుమార్, కో-కన్వీనర్ ఆర్. శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు గోవింద్, రవి కుమార్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి





**భువనగిరి, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** : పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించుకుని జీవితంలో స్థిరపడాలని, కష్టపడి సాధించాలనే దృఢసంకల్పంతో ముందుకు సాగితే విజయాలు సాధ్యమవుతాయని భువనగిరి డెవలప్ మెంట్ ఫోరం వ్యవస్థాపకులు మెరుగు మధు అన్నారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో స్థానిక శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలలో మైత్రి అకాడమీ నల్గొండ ఆధ్వర్యంలో ట్రస్మా సహకారంతో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పదవ తరగతి అనంతరం అందుబాటులో ఉన్న వివిధ డిప్లమా కోర్సులు మరియు రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మైత్రి అకాడమీ చైర్మన్ పాముల అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ, పదో తరగతి తర్వాత సిఐటిడి, ప్లాస్టిక్ టెక్నాలజీ, పాలిటెక్నిక్ వంటి ఎంట్రెన్స్ పరీక్షల ద్వారా డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలు పొందే అవకాశాలు విస్తారంగా ఉన్నాయని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, సరైన మార్గదర్శకత్వం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు సరైన దిశలో ముందుకు సాగితే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చునని చెప్పారు. శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మధిర మల్లేశం మాట్లాడుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తే విజయాన్ని అందుకోవడం సాధ్యమని, ఇలాంటి అవగాహన తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు పాలకూర వెంకటేశం, కళాశాల ఉపన్యాసకులు కె. సాయిరాం, స్వామి, నరసింహా చారి, తిరుపతి శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పార్లమెంట్ సమన్వయకర్తగా కూన శ్రీశైలం గౌడ్ నియామకం



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఈ నియామకం తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. "సంఘటన్ సృజన్ అభియాన్" కార్యక్రమం భాగంగా మండలాలు, పట్టణాలు, విభాగాలు, గ్రామాల స్థాయిలో కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేయడానికి శ్రీశైలం గౌడ్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకత్వం సూచించింది.

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# వీడియో కాల్స్ ద్వారా అసభ్య వేధింపులు...

## - కేసు నమోదు చేసిన కుషాయిగూడ పోలీసులు




**కుషాయిగూడ, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** : కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళపై అసభ్యకర వీడియో కాల్స్ ద్వారా వేధింపులు జరుగుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తి ఒక మొబైల్ నంబర్ ద్వారా గత మార్చి మొదటి వారం నుండి పలుమార్లు వీడియో కాల్స్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి వీడియో కాల్స్‌లో తన ప్రైవేట్ పార్ట్స్ ను ప్రదర్శిస్తూ బాధితురాలిని వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల ఏప్రిల్ 26న ఉదయం సుమారు 11.30 గంటల సమయంలో కూడా ఇలాంటి కాల్స్ రావడంతో బాధితురాలు తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు తెలిపారు. కాల్స్‌కు స్పందించకపోయినా, నిందితుడు తన అసభ్య ప్రవర్తనను కొనసాగిస్తున్నాడని వెల్లడించారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న కుషాయిగూడ పోలీసులు సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలి గోప్యతను కాపాడుతూ నిందితుడిని త్వరితగతిన గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఇలాంటి వేధింపులు ఎదురైన వారు వెంటనే పోలీసులను సంప్రదించాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# కుషాయిగూడలో యువతి అదృశ్యం



**కుషాయిగూడ, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** : కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఉప్పల్ బీరప్ప గడ్డ వెంకటేశ్వర నగర్ బాలాజీ నగర్ కు చెందిన ఫిర్యాదుదారు దేవసోత్ సీతారాం తన కుమార్తె డి. సుధా (25) కనిపించకుండా పోయిందని ఫిర్యాదు చేశారు. సుధా ఈసీఐఎల్ లోని శ్రీకర ఆసుపత్రిలో నర్స్‌గా పనిచేస్తోంది. కాగా ఈ నెల 18న కుటుంబ సభ్యులతో ప్రేమ వ్యవహారం విషయంలో తలెత్తిన విభేదాల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు అనుమానిస్తున్నారు. అనంతరం ఈసీఐఎల్ లోని హాస్టల్‌లో ఉంటుందని కుటుంబ సభ్యులకు సమాచారం అందినప్పటికీ ప్రస్తుతం అక్కడ కూడా లేకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ నెల 26న ఆసుపత్రిలో విచారణ చేయగా, గత రెండు రోజులుగా ఆమె డ్యూటీకి హాజరు కాలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో ఎన్. సురేష్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ సీతారాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. యువతి ఆచూకీ కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టినట్లు కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ ఎల్. భాస్కర్ రెడ్డి తెలిపారు. యువతి ఆచూకీపై సమాచారం ఉన్న వారు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు కోరారు.


# ఉప్పల్ ఎమ్మెల్యే చేతుల మీదుగా రమేశ్‌కు అభినందనలు



**ఉప్పల్, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** :ఇటీవల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవా స్ఫూర్తి జాతీయ అవార్డు అందుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వ్యక్తిగత సహాయకుడు ఆలేటి రమేశ్‌ను సోమవారం ఎమ్మెల్యే స్వయంగా అభినందించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో రమేశ్ చూపుతున్న సేవా భావం, కృషిని గుర్తిస్తూ మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడంలో రమేశ్ అంకిత భావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని రమేశ్‌కు అభినందనలు తెలిపారు.

# కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ మాజీ డైరెక్టర్ వేణుగోపాల్ రావు మృతి

## - భక్తులు, వ్యాపార వర్గాల్లో విషాదం



**హైదరాబాద్, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ)** :కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ మాజీ డైరెక్టర్, ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ వేణుగోపాల్ రావు సోమవారం తెల్లవారుజామున ఆకస్మికంగా కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలియగానే స్థానికులు, వ్యాపార ప్రముఖులు, భక్తులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వేణుగోపాల్ రావు తన పదవీ కాలంలో దేవాలయ అభివృద్ధికి విశేష కృషి చేసి భక్తుల మన్ననలు పొందారు. అదే విధంగా ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌గా వినియోగదారులకు నిరంతర సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించారు. ఆయన మరణం పట్ల ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల అధికారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వేణుగోపాల్ రావు మరణం తమకు తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన పార్థివ దేహానికి నివాళులర్పిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# సంపాదకీయం

## ఏఐతో భవిష్యత్తు..

నలభై ఆరేళ్ల క్రితం అంటే 1980లో దేశంలో కంప్యూటరీకరణను విస్తరింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆందోళనలు తలెత్తాయి. 1984 సంవత్సరాన్ని 'యాంటీ కంప్యూటరైజేషన్ సంవత్సరం'గా పరిగణించారు. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని, ఆర్థికంగా దెబ్బతింటాయని, దేశంలో తీవ్ర పరిస్థితులు తలెత్తుతాయని కార్మికులు నిరసన ప్రదర్శనలు సాగించారు. అయితే రానురాను డిజిటల్ టెక్నాలజీని అమలు లోకి విస్తారంగా తీసుకు రావడంతో సమాజంలోని అన్ని వర్గాల్లో, దేశం మొత్తం మీద ఆలోచనల్లో మార్పు రావడం ప్రారంభమైంది. కంప్యూటర్లు, ఆధునిక సాంకేతికత భారీగా ఉద్యోగాలు కల్పిస్తాయని, జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని నమ్మకం పెరిగింది. ఎఐ (కృత్రిమ మేధ) ఆధునిక ప్రపంచంలో కీలకమైన కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఎఐ గురించే చర్చ వినిపిస్తోంది. మానవ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నో పెద్దమార్పులు వచ్చాయి. కానీ ఇప్పుడు ఎఐ అన్నది అత్యంత శక్తివంతమైన, అతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారత్ అగ్రస్థానం సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రారంభం కావడం చెప్పుకోదగిన ఘట్టం. ఎఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో మనదేశం కీలకంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ఏర్పాటైన ఈ సదస్సు గురించి ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే దేశంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, వంటి అనేక రంగాల్లో ఎఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 22 రంగాల్లోని 17 రంగాల కంపెనీలు తమను తాము ఎఐ సాంతికత దిశగా మార్చుకోవలసిన ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఎఐతో ఎక్కువ అనుబంధం ఉన్న ఐటి వంటి రంగాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఎఐ సిఇఒ ముస్తఫా సులేమాన్ వచ్చే 18 నెలల్లో కంప్యూటర్ ఉద్యోగాలన్నీ ఎఐతో భర్తీ అవుతాయని అంచనా వేశారు. ఎఐ వల్ల 2035 నాటికి ప్రపంచ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) లో 15 శాతం పాయింట్లు పెరగవచ్చని ఏడాది క్రితం ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది. అంటే ప్రతి సంవత్సరం సుమారు 1 శాతం అదనపు అభివృద్ధి తథ్యమన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ సదస్సు ఒక బలీయమైన జాతీయ ఎఐ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మాత్రమే ప్రయత్నించకుండా ప్రపంచ దక్షిణార్థ దేశాలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలన్న తపన కనిపిస్తోంది. ఆయా దేశాలు కృత్రిమ మేధపై తమ ప్రణాళికలను ఈ వేదికపై వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఎఐ ప్రణాళికలకు సంబంధించి భారత్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ సాంకేతికతకు కావలసిన కనీస సెమీ కండక్టర్లు లేదా కంప్యూటర్ చిప్‌లు తయారు చేసే సామర్థం ఇంకా భారత్‌కు అలవడ లేదు. ప్రస్తుతం దేశంలో ఎఐ సంపూర్ణ సామర్థంతో ఏ కంపెనీ లేదు. అలాగే మెగా డేటా సెంటర్లు లేవు. పాత్రధారులు, నాటకం స్క్రిప్టు, కనీసం వేదిక లేకుండా ఏదైనా నాటకం ఎలా ప్రదర్శించలేరో అలాగే క్షేత్రస్థాయిలో కనీస మౌలిక అవసరాలులేకుండా ఎఐ సాంకేతికతను సాధించడం కష్టతరమే. అయినప్పటికీ ఎఐకి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గత కొన్నేళ్లుగా ఏర్పడి చిగుళ్లు మొలకెత్తడం ప్రారంభమైంది. రెండేళ్లుగా సెమీకండక్టర్ల తయారీ అత్యంత నాటకీయంగా ఆవిర్భావమైంది. ఈ ఏడాది జనవరి నాటికి దేశం లోని ఆరు రాష్ట్రాల్లో 10 సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులు వచ్చాయని, వీటిలో కొన్ని ఆన్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం అంచనాగా చెబుతోంది. ఇక రెండో అంశం.. దేశంలో మెగా డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించడం గత ఏడాది గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, డిజిటల్ కనెక్షన్, తదితర ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలు 2030 వరకు ఎఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో దాదాపు 68 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పర్యావరణం నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే చెప్పవచ్చు. ఈ సమయంలో ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తేనే ఊపందుకుంటుంది. ఆయా ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థల అధినేతలు భారతదేశ సామర్థం గురించి ఆశావహులుగా ఉన్నారు. జెన్‌సెన్ హుయాంగ్, గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, తదితరులు భావితరానికి ఎఐ సాంకేతిక కేంద్రంగా భారత్ వర్ధిల్లుతుందని, ఎఐని భారత్ ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయాలతో దృఢమైన విశ్వాసం వెలిబుచ్చడం గమనార్హం. భారత్‌లో మానవ వనరులకు లోటు లేదని, ఎఐ అమలు స్థాయి మరింత ముందుకు వెళ్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎఐ ఫ్రంట్రన్నర్ చాట్ జిపిటిలో ప్రపంచం మొత్తం మీద రెండో భారీ మార్కెట్‌గా భారత్ ఉంటోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ అల్ట్‌మాన్ అంగీకరించారు. ఎఐ నమ్మదగిన ముఖ్యమైన మార్కెట్‌గా అభివర్ణించారు. ఇవన్నీ ఎఐ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి. ఏఐ వల్ల పలు ఉద్యోగాలకు పోతాయని ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రముఖ బిలియనీర్, పారిశ్రామిక వేత్త వినోద్ ఖోస్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ టూల్స్ రాబోయే ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓ ఉద్యోగాలు దాదాపు కనమరుగవుతాయని అంచనా వేశారు. రానున్న 15 ఏళ్లలో నైపుణ్య ఆధారిత వృత్తులు తుడిచిపెట్టుకుపోతాయని హెచ్చరించారు. అయితే విద్య, వైద్య సంరక్షణ అందరికీ అందుబాటులో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 నేపథ్యంలో హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వినోద్ ఖోస్లా మాట్లాడారు. బిపిఓ లేదా బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ అనేది కంపెనీలు థర్డ్–పార్టీ సర్వీస్ ప్రొవైడర్లకు అవుట్‌సోర్స్ చేసే లార్జ్ సెగ్మెంట్ వర్క్‌ను సూచిస్తుంది. ఏఐ వల్ల ఇది తీవ్రంగా ప్రభావితమవుతుందని తెలిపారు. ఇండియాలోనే ఐటీ సర్వీసెస్‌పై కూడా ఇదే తరహా ప్రభావ ఉంటుందని అంచనా వేశారు. ఏఐ సిస్టమ్స్ ఆర్థికంగా విలువైన పనులలో మానవులను అధిగమించగల స్థితికి వేగంగా చేరుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఏఐ అనేది డిజిటల్ అసిస్టెంట్స్ నుండి అటానమస్ ఏఐ వర్కర్స్ దిశగా మారుతుందని, అకౌంటింగ్, లా, మెడిసిన్, చిప్ డిజైన్ వంటి రంగాలు మరో దశాబ్దకాలంలో ఏఐ వల్ల ప్రభావితం కావచ్చని తెలిపారు. ఈ తరుణంలో ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఢిల్లీలో ప్రారంభం కావడం శుభోదయమే. ఇది విజయవంతమైతే ఈ శిఖరాగ్ర సమావేశం భారతీయ సంకల్పానికి కేవలం ఒక వేడుకలా మాత్రమే కాకుండా, ప్రపంచానికే కీలకమైన మలుపుగా మారుతుందన్న ఆశ కలుగుతోంది.

## బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా

# రాధిక చౌరస్తాలో జెండా ఆవిష్కరణ




ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 27, (తెలంగాణ దిశ) : బిఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ల పిలుపు మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక చౌరస్తా వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బండారి నీలం రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, బేతాళ బాలరాజు, షేర్ మణమ్మ, మురళి పంతులు, ఎస్.ఎ. రహీమ్, రమేష్ చారి, సత్తమ్మ, సింగారపు మనమ్మ, సరిత, మాలతి, సింగారపు శ్రీనివాస్, మొగిలయ్య, మొగులయ్య, బడేటి చిన్న, పిట్టల రాజు, నాగపురి రాజు, సాయి రెడ్డి, సింగం రాజు, గడ్డం శీను, గోలి శీను, సురేష్, సదాశివ చారి, ఈ. భాస్కర్, కృష్ణ, సాంబశివరెడ్డి, తిరుమలయ్య, మన్సూర్, కరీం, శివ, ఆంద్రూస్, సత్యనారాయణ గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై జెండా ఆవిష్కరణ అనంతరం సంబరాలు నిర్వహిస్తూ బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# గాజా వాసులను వెంటాడుతున్న మృత్యువు

ఇప్పటికే అనేక కష్టాలను ఎదుర్కొంటున్న గాజావాసులను కొత్త ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. వైద్య సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్న గాజా వాసుల విషయంలో ఇజ్రాయిల్ మరింత అమానుషంగా వ్యవహరిస్తోంది. వారిని మృత్యుముఖంలోకి నెడుతోంది. గాజాలో ఆరోగ్య వ్యవస్థ ఇప్పటికే కుదేలయింది. తాజాగా ఇజ్రాయిల్ చర్యలతో ఏ క్షణాన అయినా కుప్పకూలిపోయే ప్రమాదం తలెత్తింది. గాజాలోకి వైద్య పరికరాలు, మందులు ప్రవేశించకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటుం డడంతో వేలాది మంది రోగులను మృత్యువు వెంటాడుతోంది. గాజాలోని ఆస్పత్రులలో పరిస్థితి దారుణంగా, భయానకంగా ఉన్నదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మునీర్ అల్–బర్ష్ తెలిపారు. అత్యవసర వైద్య సరఫరాలను ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని, ఫలితంగా కీలక కేసులకు వైద్యులు చికిత్స అందించలేకపోతున్నారని చెప్పారు. అయితే, అత్యవసర మందులు, వైద్య పరికరాలను గాజాలోకి ఇజ్రాయిల్ సైన్యం అనుమతించకపోవడంతో రోగుల ప్రాణాలు కాపాడేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయని గాజా వైద్యులు చాలా కాలంగా చెబుతూనే ఉన్నారు. అక్టోబరులో కాల్పుల విరమణ అమలులోకి వచ్చినప్పటికీ హమాస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తోంది. వైద్య సహాయక వాహనాలను గాజాలోకి ప్రవేశించనివ్వడం లేదు. దీంతో మందులు, వైద్య సరఫరాల కొరత తీవ్రంగా ఉన్నదని, ముఖ్యంగా శస్త్రచికిత్సలు చేసేందుకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేదని వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు కరెంటు కష్టాలు, జనరేటర్ల కొరత వెంటాడుతోందని వారు తెలిపారు. 30 సంవత్సరాల క్రితం పాలస్తీనా అథారిటీ ఏర్పడిన తర్వాత ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఎన్నడూ ఎదురవలేదని మునీర్ అల్–బర్ష్ చెప్పారు. రెండు సంవత్సరాలకు పైగా కొనసాగిన యుద్ధంలో దాదాపు గాజా ఆస్పత్రులన్నింటి పైన దాడులు జరిగాయి. ఫలితంగా వైద్య సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. 34 ఆస్పత్రులు సహా 125 ఆరోగ్య కేంద్రాలకు నష్టం వాటిల్లింది. చికిత్స అందకపోవడంతో సుమారు నాలుగు వేల మంది గ్లుకోమా రోగులు శాశ్వతంగా కంటిచూపును కోల్పోయే ప్రమాదం తలెత్తింది. విదేశాలలో చికిత్స కోసం అనుమతి పొందేందుకు దరఖాస్తు చేసుకున్న 1,156 మంది రోగులు అది రాకముందే ప్రాణాలు కోల్పోయారు. అలాగే, గూడును కోల్పోయి తాత్కాలిక శిబిరాలలో తలదాచుకుంటున్న 40 వేల మంది గర్భిణుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఐదు సంవత్సరాల లోపు వయసున్న మూడు లక్షల మందికి పైగా పిల్లలు పోషకాహారలోపంతో బాధపడుతున్నారు.

# కార్పొరేట్ స్వామ్యం




మన దేశ ఎన్నికల వ్యవస్థలో రాజకీయ అధికారానికి డబ్బుకు మధ్య ఉన్న అనుబంధం కొత్త కాదు కానీ నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ హయాంలో ఈ బంధం కొత్త పుంతలు తొక్కింది. ఇది ఎంత వికృతంగా మారిందో, ఎంతగా వ్యవస్థాకృతమైందో ఇప్పుడు స్పష్టంగా బయటపడుతోంది. 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గోప్యతగా సాగిన రాజకీయ నిధుల (ఎలక్టోరల్ బాండ్స్) తీరును బట్టబయలు చేసింది. సొంత ప్రయోజనాల కోసం అధికారంలో ఉన్న పార్టీతో కుమ్మక్కు కావడం, లేదా వ్యవస్థలను ఎక్కడ ఉసిగొల్పుతుందోనన్న భయమో ఆ నిధుల వెల్లువకు కారణమని స్పష్టమైంది. అయితే ఆ తీర్పు తర్వాత పరిణామాలు చూస్తే నిధుల ప్రవాహం ఏమాత్రం తగ్గలేదని, మార్గం మాత్రమే మారిందని అర్థమవుతోంది. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం 2024–25లో రాజకీయ పార్టీలకు వచ్చిన మొత్తం విరాళాల్లో 85 శాతం ఒక్క బిజెపికే దక్కాయి. గత ఏడాది ఇది 56 శాతమే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బిజెపికి ఆరువేల కోట్ల రూపాయ లకు పైగా నిధులు లభించాయి. ఇది ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నిధులతో పోల్చుకుంటే దాదాపు 12 రెట్లు ఎక్కువ! మరికొన్ని పార్టీలకూ కొంత మొత్తం నిధులు సమకూరినా అవి అడుగు, బొడుగే! కార్పొరేట్ల నుండి ఏ రూపంలోనూ నిధులు స్వీకరిం చేది లేదని సిపిఎం ఇప్పటికే ప్రకటించి అమలు చేస్తున్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే, కార్పొరేట్ రంగమంతా తన పెట్టుబడులను అధికారపార్టీ వైపునకు మళ్ళించడమే ఇక్కడ ముఖ్యమైన అంశం. అలా ఎందుకు జరిగిందన్నదే కీలక ప్రశ్న! 2018 నుంచి 2024 వరకు కొనసాగిన ఎన్నికల బాండ్ల వ్యవస్థలోనూ బిజెపినే ప్రధాన లబ్ధిదారు. ఈ పథకం, కార్పొరేట్లకు పూర్తి గోప్యత కల్పించింది. భయం లేకుండా విరాళాలు ఇవ్వడం, తమకు కావాల్సిన పని చేయించుకోవడం ఇదే ఆ వ్యవస్థ యొక్క అసలు రూపం. సుప్రీం తీర్పుతో ఈ విధానం రద్దు అయినట్టు కనపడినప్పటికీ పరోక్షంగా అదే కొనసాగుతోంది. తేడా ఏమిటంటే, బాండ్లకు బదులుగా ఎన్నికల ట్రస్టుల ద్వారా విరాళాలు వెళున్నాయి. పార్టీకి, విరాళమిచ్చే సంస్థకు మధ్య ఉన్న సంబంధాన్ని కొత్త మార్గం కూడా పూర్తిగా మూసివేయడం లేదు. ధన ప్రవాహాన్నీ, దాని గోప్యతను ఏమాత్రం మార్చలేదు. దీని అర్థం సుప్రీంకోర్టు ఒక తలుపు మూస్తే, కార్పొరేట్ రాజకీయాలు మరో తలుపును తెరుచుకున్నాయనే! ప్రూడెంట్, ప్రోగ్రెసివ్, ఎబి జనరల్ వంటి ఎన్నికల ట్రస్టుల వెనుక దేశంలోని అతి పెద్ద కార్పొరేట్ సంస్థలు ఉండటం ఈ వాస్తవాన్నే ఎత్తి చూపుతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు నెలల్లోనే బిజెపికి విరాళాలు విపరీతంగా పెరగడమే దీనికి నిదర్శనం. ఇక్కడ అసలు ప్రమాదం ప్రజాస్వామ్యానికి కలిగే నష్టం. ఒకే పార్టీ వద్ద అపారమైన ఆర్థిక వనరులు కేంద్రీకృతమైతే ఎన్నికలలో పోటీ సమానస్థాయిలో ఉండదు. ఏకపక్ష ప్రచారం సాగుతుంది. మీడియా కథనాలు సైతం వక్రీకరణకు గురవుతాయి. కాబట్టి ప్రజలు వాస్తవాలను తెలుసుకోలేరు. ఈ వికృత ధోరణిని మీడియా లో ఇప్పటికే చూస్తున్నాం. ఓటర్లను ప్రలోభపెట్టడం విపరీతంగా సాగుతుంది. ప్రభుత్వాల విధాన నిర్ణయాలు విరాళాలు ఇచ్చిన అస్మదీయుల ప్రయోజనాలకే ఉపయోగపడతాయి. చివరకు పరిపాలన తీరు ఆర్థిక లావాదేవీగా మారుతుంది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానపు అవలక్షణం 'నీకింత నాకింత' సర్వసాధారణమౌతుంది. ప్రభుత్వం ప్రజలకు చేయాల్సిన సేవలు కూడా సరుకులుగా మారి సామాన్యులను వెక్కిరిస్తాయి. ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగపరమైన దిద్దుబాటు చర్య. కానీ, కార్పొరేట్ రాజకీయాలతో కలుషితమైన వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి అది మాత్రమే చాలదన్న విషయాన్ని తాజా పరిణామాలు తేల్చి చెబుతున్నాయి. ఇప్పటికైనా ఎన్నికల నిధుల విధానంపై పునరాలోచన చేయాలి. పూర్తి స్థాయి పారదర్శకతను తీసుకురావాలి. రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు విరాళాలివ్వడానికి బదులుగా, పార్టీల ఎన్నికల ఖర్చును అంతకు ముందరి ఎన్నికల్లో వారి ప్రజాబలాన్ని బట్టి ప్రభుత్వమే సమకూర్చడం, దామాషా ఎన్నికలు వంటి సంస్కరణలు రావాలి. ప్రజానుకూల ఎన్నికల సంస్కరణల కోసం పాలకులపై పౌరసమాజం ఒత్తిడి తీసుకురావాలి. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం కార్పొరేట్ స్వామ్యంగా మారిపోతుంది.

# సొంత ఆయిల్ ఉత్పత్తిపై భారత్ దృష్టి




న్యూఢిల్లీ,: భారత్ ప్రపంచంలో చమురు వినియోగ దేశాల్లో రెండోస్థానంలో ఉంది. మొదటిస్థానంలో చైనా ఉంది. భారత్ 90 శాతం చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్?రష్యా యుద్ధంతో అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యా ఆయిల్ దిగుమతులు నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో మిత్రదేశమైన రష్యాకు భారత్ అండగా నిలిచింది. మరోవైపు రష్య కూడా బహిరంగ మార్కెట్ కన్నా తక్కువ ధరకు ఇంధనం సరఫరా చేస్తోంది. అయితే దీనిని అమెరికా జీర్ణించుకోవడం లేదు. ఈ కరణంగానే అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలు విధించారు. ఇంకా విధిస్తామని బెదిరిస్తున్నాడు. మరోవైపు వెనుజువెలా ఆక్రమణ నేపథ్యంలో రష్యాలోని షెల్ ఆయిల్‌ను భారత్‌కు సరఫరా చేయాలని ప్లాన్ వేస్తున్నాడు. ఈ క్రమంలో భారత్ వైవిధ్యమైన మార్గాలు అన్వేషిస్తోంది. ఇంధన భద్రతను బలోపేతం చేస్తోంది.

# సీబీఐ కీలకం

కడప,తెలంగాణ దిశ : వైఎస్ వివేకానంద రెడ్డిహత్య కేసు మరోసారి తెరపైకి వచ్చింది.. సిబిఐ ఇప్పటికే విచారణ పూర్తి చేసినట్లు చెప్పిన నేపథ్యంలో కొన్ని రకాల అనుమానాలు వ్యక్తం చేస్తూ వైయస్ సునీత ఇదే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ట్రయల్ కోర్టులో పిటిషన్ వేయాలని సూచించడంతో ఆమె కింది కోర్టును ఆశ్రయిం చారు. అయితే ఆమె లేవనెత్తిన అనుమానాలు, ఆపై నిందితులుగా భావిస్తున్న వారిని విచారించకుండానే సిబిఐ దర్యాప్తు పూర్తి అవ్వడాన్ని ప్రస్తావించారు. కానీ కింది కోర్టు అవేవీ పరిగణలోకి తీసుకోలేదు. దీంతో మళ్లీ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ జరగగా కోర్టు ఆసక్తికరమైన అంశాలను సిబిఐ ని అడిగి తెలు సుకుంది.



# బత్తాయి పండ్లను లైట్ తీసుకోకండి..

## ఇవి మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు..

బత్తాయి పండ్లు.. చూసేందుకు అచ్చం నారింజ పండ్లలాగే ఉంటాయి. కానీ నారింజ పండ్లంత తియ్యగా ఉండవు. మరీ పుల్లగా కూడా ఉండవు. కానీ ఇవి రుచిగా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. చాలా మంది రహదారుల పక్కన ఉండే జ్యూస్ సెంటర్లలో బత్తాయి రసం తాగేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఈ పండ్లు కాస్త తీపి, పులుపు రుచి కలిగి ఉంటాయి. చూసేందుకు పెద్ద నిమ్మ పండు సైజులో ఉంటాయి. బత్తాయి పండ్లనే స్వీట్ లైమ్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్ల గుజ్జు లేత పసుపు రంగులో ఉంటుంది. బత్తాయి పండ్లను చాలా మంది నేరుగా తింటారు. కానీ ఈ పండ్లను జ్యూస్‌గా తాగితేనే చాలా బాగుంటుంది. బత్తాయి పండ్ల రసాన్ని చాలా మంది ఇష్టంగా తాగుతారు. బత్తాయి పండ్లను తింటున్నా లేదా జ్యూస్‌ను తాగుతున్నా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

నోటి దుర్వాసనకు చెక్..: బత్తాయి పండ్లలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. జలుబు, జ్వరం వచ్చినప్పుడు రోజుకు 2 సార్లు ఈ పండ్ల జ్యూస్‌ను తాగాలి. దీంతో త్వరగా కోలుకుంటారు. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. శరీరం కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. చురుగ్గా మారుతారు. బత్తాయి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది దంతాలు, చిగుళ్లను దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. బత్తాయి పండ్లను తింటే నోట్లో లాలాజలం అధికంగా స్రవించబడుతుంది. ఇది మనం తిన్న ఆహారాన్ని సులభంగా, త్వరగా జీర్ణం చేస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

మలబద్దకం ఉండదు..: బత్తాయి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే మలబద్దకం తగ్గుతుంది. రోజూ ఉదయం సుఖ విరేచనం అవుతుంది. బత్తాయి పండ్లలో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి జీర్ణ రసాలు, ఆమ్లాలు విడుదల అయ్యేందుకు సహాయం చేస్తాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ఏదైనా వ్యాధి వచ్చిన వారు బత్తాయి పండ్ల రసాన్ని సేవిస్తుంటే త్వరగా శక్తి లభించి రోగం నుంచి త్వరగా కోలుకుంటారు. ఉదయం జాగింగ్ లేదా వాకింగ్, యోగా, వ్యాయామం చేసిన అనంతరం ఒక గ్లాస్ బత్తాయి పండ్ల రసం సేవిస్తే శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. ఎంత పనిచేసినా నీరసం, అలసట రావు. బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా టీ, కాఫీ వంటివి తాగకుండా బత్తాయి పండ్ల రసం తాగితే ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

విరేచనాల నుంచి ఉపశమనం..: బత్తాయి పండ్లలో ఉండే ఆమ్లాలు జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపుతాయి. దీంతో జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అజీర్తితో బాధపడేవారికి బత్తాయి రసం ఔషధంగా పనిచేస్తుంది. బత్తాయి పండ్లలో ఉండే పొటాషియం విరేచనాలను తగ్గిస్తుంది. బాధితులు త్వరగా కోలుకునేలా చేస్తుంది. కామెర్లు వచ్చిన వారు ఈ పండ్ల రసం తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. వాంతులు, తలతిరగడం వంటి సమస్యలు ఉన్నవారు బత్తాయి పండ్ల రసం తాగితే మంచిది. గొంతు సంబంధ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవారు బత్తాయి రసం తాగితే త్వరగా ఉపశమనం లభిస్తుంది. రోజూ ఈ జ్యూస్‌ను సేవించడం వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బ్లడ్ క్లాట్స్ కరిగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా బత్తాయి పండ్లు మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు. కనుక ఇవి కనబడితే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.

# పొట్టను పట్టించుకుందాం



మన శరీరాలకు పోషణ మనం తినే ఆహారం నుంచే లభిస్తుంది. శరీరం బాగుండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. దురదృష్టవశాత్తూ ఇప్పుడు చాలామంది జంక్ ఫుడ్, రిఫైన్డ్ పిండి, చక్కెరలు, ఉప్పు, రసాయనాలు, ప్రిజర్వేటివ్‌లు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు. ఇలాంటి ఆహారాలు జీర్ణ సమస్యలతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలకు బాటలు వేస్తాయి. అంతేకాదు మసాలా, వేపుడు ఆహారాలు కూడా పొట్టలో అసౌకర్యం కలుగజేస్తాయి. కాబట్టి, పొట్టకు మేలు చేసే ఆహారాన్ని మన భోజనంలో భాగం చేసుకోవాలి.

యోగర్ట్: పొట్ట ఆరోగ్యానికి యోగర్ట్ మంచి ఆహారం. రోజూ యోగర్ట్ తీసుకోవడంవల్ల జీర్ణ సమస్యలనుఅధిగమించవచ్చు. ఉదయం వేళలో, మధ్యాహ్నం భోజన సమయంలో యోగర్ట్ తీసుకోవడం మంచిది.

హోల్ గ్రెయిన్స్: ముతక ధాన్యాలు (హోల్‌గ్రెయిన్స్) పొట్టకు మేలుచేసేవిగా పరిగణిస్తారు. గోధుమలు, ఓట్స్, బియ్యం, ఇతర హోల్‌గ్రేన్స్ నుంచి ఆహారం తీసుకోవాలి. ఇవి పొట్టకు మంచివి. వీటిలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది.

అరటిపండు: బాగా మాగిన అరటిపండు పొట్టకు ఎంతో మేలుచేస్తుంది. ఇందులో పొటాషియం ఉంటుంది. అరటిపండు తినడం వల్ల అరుగుదల మెరుగుపడుతుంది.

ఎన్నో పొట్ట సమస్యలు కూడా పారిపోతాయి. అరటిపండు తినడం పొట్టకు సంబంధించిన గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యలను తగ్గిస్తుంది. బొప్పడిపండు: బొప్పడిపండు అరుగుదలకు సహాయకారిగా ఉంటుంది. పొట్టను శుభ్రం చేసే పోషకాలకు ఇది గని. అలా బొప్పడిపండు మలబద్ధకాన్ని నివారిస్తుంది. అరుగుదల మొదలుకుని గుండెలో మంట, అజీర్తి తదితర సమస్యలను దూరం చేస్తుంది. అల్లం: అల్లాన్ని పొట్టకు మేలుచేసేదిగా పరిగణిస్తారు. వికారం, కడుపునొప్పితో బాధపడుతున్నవాళ్లకు అల్లం మంచిది. రోజువారీ గా భోజనంలో ఏదో విధంగా అల్లాన్ని చేర్చుకోవడం మంచిది.

# నల్ల జీలకర్రలో అనేక లాభాలు..!



జీలకర్రను మనం ఎప్పటి నుంచో వంట ఇంటి పోపు దినుసుగా ఉపయోగిస్తున్నాం. జీలకర్రను నిత్యం అనేక వంటల్లో వేస్తుంటారు. జీలకర్రను కూరల్లో వేస్తే కూరలు చక్కని వాసన వస్తాయి. రుచిగా కూడా ఉంటాయి. అయితే జీలకర్రలో మరో రకం జీలకర్ర కూడా ఉంటుంది. అదే నల్ల జీలకర్ర. దీన్ని చాలా మంది చూసి ఉండరు. కానీ నల్ల జీలకర్రను కూడా మనం ఉపయోగించవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. నల్ల జీలకర్రను ఒక టీస్పూన్ మోతాదు లో తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుండాలి. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. నల్ల జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ వీటిల్లో సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తుంది. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. కీళ్ల నొప్పులు, వాపులకు..: నల్ల జీలకర్రలో అధికంగా ఉండే థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఈ జీలకర్రను వేసి మరిగించిన నీళ్లను రోజూ సేవిస్తుంటే కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతా యి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. నల్ల జీలకర్రలో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. అంటే దీన్ని తీసుకుంటే రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది.

# వేప పండ్ల గురించి ఈ నిజాలు తెలుసా..?

### ప్రకృతి మనకు అందించిన ఆరోగ్య ప్రదాయిని ఇవి..!

వేప చెట్టు లేని ఊరిలో అసలు ఉండకూడదు.. అని మన పూర్వీకులు చెబుతుండేవారు. ఎందుకంటే ఆయుర్వేద ప్రకారం వేప అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఈ చెట్టులోని ప్రతి భాగం మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకనే మన పెద్దలు వేప చెట్టు గురించి అంత గొప్పగా చెబుతుండేవారు. వేప చెట్టుకు చెందిన ఆకులు, బెరడు, పువ్వులు.. ఇలా అన్నీ ఉపయోగకరమే. అలాగే వేప పండ్లు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. వేప పండ్ల నుంచి నూనెను తీసి ఉపయోగిస్తుంటారు. వేప పండ్లను కొందరు ఎండబెట్టి డ్రై ఫ్రూట్స్ రూపంలో తింటారు. వే పండ్లను నేరుగా తింటే చేదుగా ఉంటాయి. కనుక వాటిని ఎండ బెట్టి తినవచ్చు. వేప పండ్లను తినడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది.


నులి పురుగుల సమస్యకు..: వేప పండ్లలో యాంటీ వార్మ్ గుణాలు ఉంటాయి. అంటే పొట్టలో నులి పురుగులు ఉన్నవారు ఈ పండ్లను తింటే ఆ పురుగులు నశిస్తాయి. వేప పండ్లలో ఉండే సమ్మేళనాలు పొట్టలో ఉండే పురుగులను చంపేస్తాయి. దీంతో నులి పురుగుల సమస్య నుంచి బయట పడవచ్చు. పెద్దలకే కాదు ఈ చిట్కా పిల్లలకు కూడా మేలు చేస్తుంది. వేప పండ్లలో యాంటీ మలేరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తీసుకుంటే మలేరియా నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ పండ్లలో ఉండే సమ్మేళనాలు మలేరియాకు కారణం అయ్యే క్రిములను చంపేస్తాయి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. వేప పండ్లలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటుంటే నొప్పులు, వాపులు తగ్గుతాయి. ముఖ్యంగా కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

చర్మ సమస్యలకు..: వేప పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలపై పడే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలు సురక్షితంగా



ఉంటాయి.క్యాన్సర్, గుండె జబ్బులవంటి ప్రాణాంతకవ్యాధులు రాకుం డా అడ్డుకోవచ్చు. వేప పండ్ల గుజ్జును రాస్తుంటే ఎలాంటి చర్మ సమస్యలు అయినా ఇట్టే తగ్గిపోతాయి. గజ్జి, తామరతోపాటు చర్మంపై వచ్చే దురదలు, దద్దుర్లు తగ్గిపోతాయి. వేప పండ్లలో యాంటీ సెప్టిక్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మ సమస్యలను తగ్గిస్తాయి. వేప పండ్లు అందుబాటులో లేకపోతే వాటి నుంచి తీసిన నూనెను కూడా చర్మ సమస్యలను తగ్గించేందుకు ఉపయోగించవచ్చు. జీర్ణ వ్యవస్థకు..: వేప పండ్లను తింటుంటే జీర్ణ వ్యవస్థకు ఎంతగానో మేలు జరుగుతుంది. జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. మలబద్దకం నుంచి బయటపడతారు. గ్యాస్,అసిడిటీ, కడుపుఉబ్బరం వంటి జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం శుభ్రంగా మారుతుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు వేప పండ్లలో ఉన్నాయని ఆయుర్వేదం చెబుతోంది. వేప పండ్లను రోజూ తింటుంటే రక్తంశుద్ధి అవుతుంది.దీంతో రక్త సంబంధ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. వేప పండ్లలో సహజసిద్ధమైన ఇన్‌సెక్టిసైడల్ గుణాలు ఉంటాయి. అంటే ఈ పండ్ల ద్వారా పురుగులు, క్రిమి కీటకాలను నాశనం చేయవచ్చు. ముఖ్యంగా వ్యవసాయం చేసేవారికి ఈ పండ్లు సహజసిద్ధమైన ఎరువుగా, పోషక పదార్థంగా ఉపయోగ పడతాయి. దీంతో పంటను నాశనం చేసే పురుగులు, క్రిమికీటకాలు నశిస్తాయి. అలాగే పంటకు పోషణ లభించి దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఇలా వేప పండ్లతో అనేక లాభాలను పొందవచ్చు.

# మన చుట్టూ పరిసరాల్లోనే కనిపించే పువ్వులు ఇవి..



చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా నీలి రంగులో ఉండే ఈ పువ్వులను మీరు గమనించారా..? ఇవి మన చుట్టూ పరిసరాల్లోనే కనిపిస్తుంటాయి. శంఖపుష్పి అనే తీగ జాతికి చెందిన మొక్కకు ఈ పువ్వులు పూస్తాయి. ఈ పువ్వులు తెలుపు లేదా నీలి రంగులో ఉంటాయి. అయినప్పటికీ నీలి రంగు పువ్వులతోనే మనకు ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. ఆయుర్వేదంలో పలు రకాల ఔషధాలను తయారు చేయడంతోపాటు పలు వ్యాధులను నయం చేసేందుకు శంఖపుష్పి మొక్కను ఉపయోగిస్తుంటారు. ఈ మొక్కకు చెందిన తీగ, వేర్లు, ఆకులు కూడా ఉపయోగకరమే. అయితే సాధారణంగా ఈ మొక్కకు పూసే నీలి రంగు పువ్వులనే అధికంగా ఉపయోగిస్తుంటారు. ఈ పువ్వుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి.

మెదడుకు టానిక్..: శంఖపుష్పి పువ్వులను వాడడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఏకాగ్రతగా పనిచేస్తారు. ఏదైనా అంశంపై ఎక్కువగా దృష్టి పెట్టగలుగుతారు. దీంతో ఆలోచనా శక్తి పెరుగుతుంది. పనిచేసే విషయాల్లో రాణిస్తారు. తెలివి తేటలు పెరుగుతాయి. మెదడు వికాసం చెంది యాక్టివ్‌గా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. బద్ధకం పోతుంది.

### విడిచిపెట్టకుండా తెచ్చి వాడండి.. ఎందుకంటే..?

ఎల్లప్పుడూ ఉత్సాహంగా కనిపిస్తారు. మానసిక శక్తి పెరుగుతుంది. మానసికంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటారు. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. డిప్రెషన్‌తో బాధపడుతున్నవారికి ఈ పువ్వులు చక్కని ఔధషంలా పనిచేస్తాయి. మానసికంగా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారు. శంఖపుష్పి మెదడుకు టానిక్‌లా పనిచేస్తుంది. మెదడు కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్యంలో మతిమరుపు రాకుండా చూసుకోవచ్చు.

గాఢ నిద్ర కోసం..: శంఖపుష్పి పువ్వులను వాడితే ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. మరుసటి రోజు ఉదయం ఉత్సాహంగా నిద్ర లేస్తారు. ఈ పువ్వుల్లో బయో యాక్టివ్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. శంఖపుష్పి పువ్వుల్లో హైపో లిపిడెమిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పువ్వులను వాడితే శరీరంలోని కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

ఎలా వాడాలి..?: శంఖపుష్పి పువ్వుల్లో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడేలా చేస్తాయి. శంఖపుష్పిని వాడడం వల్ల జీర్ణ శక్తి మెరుగు పడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. ఇలా ఈ పువ్వులతో అనేక లాభాలను పొందవచ్చు. అయితే ఈ పువ్వులను ఎలా వాడాలంటే.. నాలుగైదు శంఖపుష్పి పువ్వులను తీసుకుని నీటిలో వేసి మరిగించి అనంతరం వడకట్టాలి. ఈ నీళ్లు గోరు వెచ్చగా ఉండగానే అందులో కాస్త నిమ్మరసం, తేనె కలిపి తాగేయాలి. ఈ విధంగా శంఖపుష్పి పువ్వులను వాడుతుంటే ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చు.

# గౌట్‌కు మందు కాకరకాయ



ప్రస్తుతం మనదేశంలో చాలామంది యూరిక్ ఆమ్లం సమస్యతో బాధపడుతున్నారు. మన శరీరంలో ప్యూరిన్ అనే మూలకం విచ్ఛిన్నం వల్ల యూరిక్ ఆమ్లం తయారవుతుంది. ఇది రక్తం ద్వారా కిడ్నీలకు చేరుతుంది. మూత్రం ద్వారా బయటికి వెళ్లిపోతుంది. అయితే, యూరిక్ ఆమ్లం మూత్రంలో బయటికి వెళ్లనప్పుడు శరీరంలో దాని పరిమాణం పెరుగుతూ వస్తుంది. దీనివల్ల కీళ్లనొప్పులు వస్తాయి. లేవడం, కూర్చోవడం కష్టమైపోతుంది. దీన్నే గౌట్ అని పిలుస్తారు. యూరిక్ ఆమ్లం పేరుకోవడం వల్ల గుండెజబ్బులు, అధిక రక్తపోటు, కిడ్నీల్లో రాళ్లు, ఆర్థరైటిస్ లాంటి సమస్యలూ తలెత్తుతాయి. కాబట్టి, దీన్ని సరైన సమయంలో గుర్తించి అదుపులో పెట్టుకోవాలి. ఈ దిశగా కాకరకాయ జ్యూస్ మంచి ఔషధంగా పనిచేస్తుంది. ఆహార విధానంలో ఏవైనా మార్పులు చేసుకోవడానికి ముందు వైద్యుల సలహా తప్పనిసరి.

కాకరకాయ జ్యూస్ ప్రయోజనాలు ఏంటో చూద్దాం

యూరిక్ ఆమ్లం తగ్గింపులో కాకరలో ఔషధ గుణాలు అపారం. ఓ గ్లాసెడు కాకరకాయ రసం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో యూరిక్ ఆమ్లం స్థాయిలు సహజంగానే తగ్గిపోతాయి. కాకరలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ సి, కాల్షియం, బీటా కెరొటిన్ లాంటివి సమృద్ధిగా ఉంటాయి. ఇవి గౌట్ నివారణలో దోహదపడతాయి.

మధుమేహానికి మందుగా: మధుమేహం నియంత్రణలో కూడా కాకరకాయ ఎంతో ప్రయోజనకారి. విటమిన్ ఎ, సి, బీటా కెరొటిన్, ఇతర మినరల్స్, ఫైబర్ వల్ల ఇది ఇన్సులిన్‌లా పనిచేస్తుంది. రక్తంలో పెరిగే చక్కెర స్థాయిల నిర్వహణలో గొప్పగా ఉపయోగపడుతుంది.

ఎలా తీసుకోవాలి?: ప్రతిరోజూ పొద్దునే పరగడుపున ఓ సగం కప్పు కాకరకాయ జ్యూస్ తీసుకోవాలి. దీనికి సైంధవ లవణం, లేదంటే నిమ్మరసం కలుపుకొంటే చేదు తగ్గుతుంది. గౌట్, ఆర్థరైటిస్ సమస్యల విషయంలో కాకరకాయ జ్యూస్ మేలుచేస్తుంది. జ్యూస్ ఒక్కటి మాత్రమే కాకుండా, కాకరకాయతో రకరకాల కూరలు చేసుకుని తినడమూ మంచిదే. కాకరకాయ పొడి కూడా తీసుకోవచ్చు. దీనికోసం కాకరకాయను బాగా కడగాలి. ఆ తర్వాత దాన్ని ముక్కలుగా చేసి, నీడలో ఆరబెట్టాలి. ఆ తర్వాత వాటిని నూరి పొడిగా చేసుకోవాలి. ఈ పొడిని రోజూ పొద్దునే సగం టీస్పూన్ గానీ, టీస్పూన్ గానీ నీళ్లతో కలుపుకొని సేవించాలి.

# ఏపీలో 70 అన్న క్యాంటీన్లు



విజయవాడ,తెలంగాణ దిశ :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భం గా గ్రామీణ ప్రజలకు శుభవార్త అందించింది. నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు కాబోతున్నాయి.. మొత్తం 70 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు. జనవరి 10లోగా నిర్మాణ పనులు పూర్తి చేసి.. జనవరి 13 నుంచి 15 మధ్య ఈ క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావా లని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు విజయవంతం అయ్యాయి.. ప్రజల నుంచి ఆదరణ వస్తోంది. అందుకే గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్ల విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా మొత్తం 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. ప్రస్తుతం పట్టణాల్లో 205 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయి.. వీటిలో రోజుకు మూడు పూటలా కలిపి 2 లక్షల మందికి పైగా ప్రజలు తక్కువ ధరకే భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. ఒక్కో పూటకు కేవలం రూ.5కే రుచికరమైన ఫుడ్ అందిస్తున్నారు. ఈ పథకం గ్రామీ ణ ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నా రు. ఆంధ్రప్రదేశ్‌లో నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన 205అన్న క్యాంటీన్ల ద్వారాపేదల ఆకలి తీరుస్తున్నారు. ఇప్పటివరకు 7.20 కోట్ల మందికి పైగా ప్రజలు ఈక్యాంటీన్లలో భోజనంచేశారు. ఇందులో మధ్యాహ్న భోజనం చేసిన వారి సంఖ్య 3.16 కోట్లు. ఉదయం అల్పాహారం 2.62 కోట్ల మంది, రాత్రి భోజనం 1.42 కోట్ల మంది తీసుకున్నారు. ఈ క్యాంటీన్లలో విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుండి అత్యధిక సంఖ్యలో పేదలు వస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ జిల్లాల్లోని క్యాంటీన్లలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. పేదల ఆకలి తీర్చడమే ఈ క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశ్యం. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించడం ద్వారా ఎంతో మందికి అండగా నిలుస్తున్నాయి. ఇప్పుడు గ్రామాల్లో కూడా అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు.జిల్లాల వారీగా చూస్తే.. చిత్తూరు 7, గుంటూరు 5, శ్రీకాకుళం జిల్లా 5, తూర్పుగోదావరి 4, ఏలూరు 4, ప్రకాశం 4, కర్నూలు 4, విజయనగరం 3, అనంతపు?రం 3, అల్లూరి సీతా రామరాజు 3, అనకాపల్లి 3, బీఆర్ అంబేద్కర్ కోనసీమ 3, పశ్చిమ గోదావరి 3,కృష్ణా 3, నెల్లూరు 3,అన్నమయ్య 3,కాకినాడ 2, తిరుపతి 2, పార్వతీపురం మన్యం 1, పల్నాడు 1, ఎన్టీఆర్ 1, శ్రీసత్యసాయి 1, నంద్యాల 1, కడప 1 క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు

# ప్రతీ పనికి ఓ రేటు... ఆ జిల్లాకే సపరేట్..

## దొరకని దొరలు చాలా శాఖల్లో అనేక మంది..?

కాకినాడ,తెలంగాణ దిశ :కోనసీమ జిల్లాల పునర్విభజన తరువాత వేగంగా అభివృద్ధి చెందుతోంది కోనసీమ ప్రాంతం.. ఈక్రమంలోనే ఇక్కడ భూముల రేట్లకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి.. దీంతో ముఖ్యంగా రెవెన్యూ శాఖలో లంచావతారాలు మితిమీరిపోయి ఆర్జీదారుల నుంచి దండుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. వీఆర్ఏ స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకు అన్నిచోట్ల లంచాలు లేనిదే ఏ పని అవ్వడం లేదంటున్నారు దరఖాస్తుదారులు. అటు జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి అవుతుండగా ఈ గ్రామాల పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు కూడా ఇదే తరహా అవినీతి లీలలు సాగిస్తున్నారంటున్నారు. ఇక జిల్లా కేంద్రమైన అమలాపురం టౌన్ ప్లానింగ్, అర్బన్ డెవలప్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్ ఇలా అనేక శాఖల్లో అవినీతి జోరందుకుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి బలం చేకూరుస్తూ ఇటీవల కాలంలో ఒక్క అంబేద్కర్ కోనసీమ ప్రాంతంలోనే ఏసీబీ అధికారుల దాడుల్లో అడ్డంగా బుక్కయిపోతున్నవారు కోనసీమ ప్రాంతం వారే ఉండడం విస్మయానికి గురిచేస్తోంది. ఏసీబీ అధికారులు వలకు ఓ పెద్ద అవినీతి చేప చిక్కింది. అమలాపురం తహసీల్దార్ గా పనిచేస్తున్న పి.అశోక్ ప్రసాద్ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికి పోయాడు.. రాజమండ్రి సమీపంలోని రాజవోలుకు చెందిన గంధం దుర్గా కొండలరావు తండ్రి గంధం సత్యనారాయణ అమలాపురం రూరల్ జనుపల్లిలో 15 సెంట్లు భూమిని గతంలో కొనుగోలు చేశారు. ఈ భూమిని విక్రయించేందుకు కొలతలు అవసరం కాగా దీని నిమిత్తం దుర్గా కొండల రావు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే కొలతలు నిర్వహించాలంటే రూ.లక్ష ఇవ్వాలంటూ తహసీల్దార్ డిమాండ్ చేశాడు. చివరకు రూ.50 వేలు ముందస్తుగా ఇవ్వాలని, కొలతలు పూర్తయ్యాక మిగిలిన రూ.50 వేలు ఇవ్వాలని సూచించడంతో లంచం ఇవ్వడం ఇష్టంలేని ఫిర్యాదుదారుడు దుర్గా కొండలరావు రాజమండ్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.

దుర్గా కొండలరావు నుంచి ఇదే తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తోన్న వీఆర్ ఏ రాము రూ.50 వేలు తీసుకుని తహసీల్దార్ అశోక్ ప్రసాద్‌కు ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా ఇద్దరూ దొరికి పోయారు. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్ అశోక్ ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ రాముపై కేసు నమోదు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ కిషోర్ కుమార్ తెలిపారు. ఈ విషయం స్థానికంగా పెద్ద సంచలనం అయ్యింది..

లంచాలకు రుచి మరిగిన అవినీతి అధికారుల్లో వణుకు మొదల య్యింది.. ఇటీవల కాలంలోనే తనకున్న పొలాన్ని మ్యుటేషన్ చేసి ఇచ్చేందుకు ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి చెందిన ఓ రైతు నుంచి అదే గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న వీఆర్వో రూ.20 వేలు డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేను. ఎంతో కొంత ఇస్తాను అని చెప్పినా రేపు రా.. మాపు రా.. అంటూ కాలం గడుపుతున్న వీఆర్వోపై విసుగెత్తని సదరు ఫిర్యాదుదారుడు రాజమండ్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సదరు వీఆర్వో తన స్వగ్రామం అయిన సామంతకుర్రు తీసుకువచ్చి లంచం ఇవ్వాలని డిమాండ్ చేయడంతో నేరుగా ఏసీబీ అధికారులు ఫిర్యాదుదారుడ్ని తీసుకుని వెళ్లి లంచం ఇస్తున్న సమయంలో అడ్డంగా బుక్ చేశారు.రెండు నెలల క్రింతం ఆలమూరు మండలంలో మహిళా సబ్ రిజిస్టర్ ఒకరు ఇలానే లంచం సొమ్ము తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా బుక్కయ్యాడు. మూడు నెలల క్రితం రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో సీఐ, అంతకుముందు ఏడాది క్రితం ఎస్సై ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. రాజోలు నియోజకవర్గం పరిధిలోని సఖినేటిపల్లిలో వీఆర్వో రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు.

ముమ్మిడివరం నియోజకవర్గంలోని

కాట్రేనికోన మండలంలో ఓ వీఆర్వో లంచం సొమ్ము తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కాడు.. ఇలా మొత్తం మీద అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రాంతంలో వరుసగా లంచావతరాలు దొరికిపోవడం చర్చనీయాంశం అవుతోంది.. లంచం ఇస్తేనే కానీ ఫైల్‌ను పక్కకు కూడా జరపని లంచావతరాలు ప్రభుత్వ శాఖలో తిష్టవేసుకుని ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.. అందులోనూ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ఏర్పడ్డాక భూముల రేట్లు ఆకాశంలోకి ఎగబాకడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పన విషయంలోనూ అభివృద్ధి పథంగా ముందుకు వెళ్తున్న పరిస్థితి కనిపిస్తోందని, ఈక్రమంలోనే అవినీతివైపు ప్రభుత్వ ఉద్యోగులు అర్రులు చాస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో అయితే కొంతమంది రెవెన్యూ శాఖలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, చూసే శాఖల్లోని అధికారులు చాలా మంది లంచాల సొమ్ముకు అలవాటు పడి ప్రతీ పనిలోనూ బల్లకింద చేయిచాపే పరిస్థితి కనిపిస్తోందంటున్నారు.

# వైజాగ్ లో రహేజ పెట్టుబడులు



విశాఖపట్టణం,తెలంగాణ దిశ : విశాఖలో ఇదివరకే గూగుల్, టీసీఎస్ డేటా సెంటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి. పలు కొత్త సంస్థలు, ఐటీ కంపెనీలు నగరానికి వస్తే త్వరలోనే విశాఖ రూపురేఖలో మారనున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ నిర్మాణ సంస్థ కె.రహేజా కార్పొరేషన్ విశాఖలో ఇన్వెస్ట్ చేయడానికి నిర్ణయం తీసుకుంది. విశాఖలో త్వరలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు, ఐటీ సంస్థలకు అవసరమైన వాణిజ్య, నివాస భవనాల సముదాయాలు నిర్మించేందుకు రహేజా సంస్థ పెట్టుబడులు పెట్టనుంది. దీని ద్వారా దాదాపు 28.65 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి వస్తుందిఈ ప్రాజెక్టు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు, అలాగే ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి వీలుంటుంది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.2,172.26 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. మధురవాడ ఐటీ హిల్ నంబరు-3లో 27.10 ఎకరాలు భూమిని ప్రాజెక్టు కోసం కేటాయించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 9,681 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని రహేజా సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనలో పేర్కొంది.విశాఖలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఇటీవల ఢిల్లీలో సంస్థ ప్రతినిధులతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. గూగుల్ సంస్థ ఏపీలో ఏకంగా 1.33 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ ప్రాజెక్టు ప్రారంభంతో పలు ఐటీ, దాని అనుబంధ సంస్థలు నగరానికి రాబోతున్నాయి. ఈ సంస్థల ఏర్పాటుకు ఆఫీసు స్థలాలు కావాలి. ప్రస్తుతం మిలీనియం టవర్ 1, 2లో సుమారు 6 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలం టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలకు కేటాయించారు. విశాఖకు కొత్తగా రాబోతున్న కంపెనీలకు కార్యాలయ స్థలాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రహేజా సంస్థ చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 28.65 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఆఫీసు కార్యాలయాల కోసం అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టు విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి, ఉత్పాదకత పెరుగుదలకు, అలాగే భారీ ఉద్యోగ అవకాశాలు సృష్టించడానికి దోహదపడనుంది.మొదటి దశలో 2028 నాటికి వాణిజ్య భవనాలను, నివాస సముదాయాలను 2030 నాటికి పూర్తి చేయాలని రహేజా సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్టు పనుల కోసం రూ.663.42 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఫస్ట్ ఫేజ్ ప్రాజెక్టు పనులతో 9.59 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రానుందిరెండో దశలో 2031 నాటికి వాణిజ్య భవనాలను, 2035 నాటికి నివాస సముదాయాలను పూర్తిచేసేందుకు రహేజా సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రెండో దశలో రూ.1,418.84 కోట్లు వెచ్చించనుంది. తద్వారా 19.06 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి తెస్తామని సంస్థ ఏపీ ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనల్లో పేర్కొంది.

# ఎక్కడ నుంచైనా ఔటర్ కు..!



హైదరాబాద్,తెలంగాణ దిశ : హైదరాబాద్ నగరవాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేం దుకు హెచ్ఎండీఏ సరికొత్త ఎలివేటెడ్ కారిడార్లను ప్రతిపాదించింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుండి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు వరకు పది కిలోమీటర్ల మేర ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నారు. అలాగే, షేక్‌పేట్ నాలా నుండి గండిపేట సీబీఐటీ వరకు 200 అడుగుల రహదారి విస్తరణతో పాటు భవిష్యత్తులో ఎలివేటెడ్ కారిడార్‌ను డిజైన్ చేస్తున్నారు. ఇప్పటికే ప్యారడైజ్ నుండి శామీర్‌పేట వరకు 18.5 కిలోమీటర్ల కారిడార్ పనులు ఖరారయ్యాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నగరం నడిబొడ్డు నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు సిగ్నల్ లేకుండా అతి తక్కువ సమయ ంలో చేరుకోవచ్చు.హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో.. కోర్ సిటీ నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం వాహనదారులకు పెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం ఉన్న రహదారులు పెరుగుతున్న వాహనాల రద్దీని తట్టుకోలేకపోతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ భారీ ఎలివేటెడ్ కారిడార్లు , ఎక్స్‌ప్రెస్ వేల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.నగరం నడిబొడ్డు నుండి ఐటీ కారిడార్‌కు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్టును సిద్ధం చేసింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుండి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్లేలా ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నారు. ఈ రహదారి ఫిలింనగర్, జడ్జెస్ కాలనీ, దుర్గం చెరువు పక్క నుండి టి-హబ్ మీదుగా సాగుతుంది. సుమారు 10 కిలోమీటర్ల పొడవుండే ఈ మార్గంలో 7 కిలోమీటర్ల మేర అత్యాధునిక స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తారు. ఎక్కడా సిగ్నల్ లేకుండా నేరుగా ఔటర్ చేరుకునేలా దీనిని రూపొందిస్తున్నారు.మెహదీపట్నం, టోలిచౌకి నుండి గండిపేట వైపు వెళ్లే వాహనాల కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని అభివృద్ధి చేస్తున్నారు. షేక్‌పేట్ నాలా నుండి మణికొండ పైప్‌లైన్ రోడ్డు మీదుగా గండిపేటలోని సీబీఐటీ కాలేజీ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 200 అడుగులకు విస్తరించనున్నారు. ఈ వెడల్పైన రహదారిపై భవిష్యత్తులో 7 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేలా డిజైన్ చేస్తున్నారు. ఇది పూర్తయితే పాత ముంబై హైవేపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది.సికింద్రాబాద్ ప్యారడైజ్ నుండి శామీర్‌పేట ఔటర్ జంక్షన్ వరకు 18.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. సుమారు 2,232 కోట్ల రూపాయలతో చేపట్టే ఈ ప్రాజెక్టులో 11.65 కిలోమీటర్ల ఆరు వరుసల ఫ్లైఓవర్ ఉంటుంది. హకీంపేట వద్ద భూగర్భ టన్నెల్ నిర్మాణం ఈ ప్రాజెక్టులో మరో ప్రత్యేకత. ఈ కారిడార్ పూర్తయితే కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట వైపు నుండి వచ్చే వాహనాలు నగరం లోపలికి వేగంగా రావచ్చు. దీనిని 24 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.హైదరాబాద్‌లో ఈ ఎలివేటెడ్ కారిడార్లు ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా.. నగర ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం చూపుతాయి. గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో పని చేసే లక్షలాది మంది ఉద్యోగులకు ఈ కొత్త కనెక్టివిటీ రోడ్లు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. ట్రాఫిక్ జాంలు తగ్గడం వల్ల ఇంధన వినియోగం తగ్గి.. నగరంలో వాయు కాలుష్యం తగ్గుముఖం పడుతుంది.మణికొండ, గండిపేట, శామీర్‌పేట పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటం వల్ల ఆయా ప్రాంతాల్లో నివాస గృహాలకు డిమాండ్ పెరుగుతుంది. మెట్రో రైలు, ఈ కొత్త ఎలివేటెడ్ కారిడార్ల మధ్య అనుసంధానం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నగరం నలుమూలల నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు గ్రీన్ ఛానెల్ కనెక్టివిటీని ఏర్పాటు చేయడం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలున్న నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.


# అవినీతిలో అగ్రస్థానం రెవెన్యూ, ఇరిగేషన్ లదే

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణలో అవినీతి తిమింగలాల వేటలో ఏసీబీ అధికారులు ఈ ఏడాది దూకుడు పెంచారు. 2025లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 220 కంటే ఎక్కువ కేసులు నమోదు కాగా.. సుమారు 190మందికి పైగాప్రభుత్వఉద్యోగులను అధికారులు అరెస్ట్ చేశారు. ముఖ్యంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల్లోనే లంచం కేసులు ఎక్కువగా వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో దాదాపు రూ.58 కోట్లవిలువైన డాక్యుమెంట్లను సీజ్ చేయగా.. వీటి బహిరంగ మార్కెట్ విలువ రూ. 500 కోట్లకు పైనే ఉంటుందని అంచనా.లంచం అడిగే అధికారుల సమాచారాన్ని 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయా లనిఅధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణలో అవినీతికి వ్యతిరేకంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తన పోరాటాన్ని ఉధృతం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులను ఇబ్బంది పెడుతూ లంచాలకు అలవాటు పడిన అధికా రుల భరతం పట్టడంలో అధికారులు ఈ ఏడాది సరికొత్త రికార్డులను సృష్టించారు. 2025 సంవత్సరం ప్రారంభం నుండి ఇప్పటివరకు తెలంగాణ వ్యాప్తంగా ఏసీబీ అధికారులు 220 కంటే ఎక్కువ కేసులు నమోదు చేశారు. ఇది గత ఏడాదితో పోలిస్తే భారీ పెరుగుదల.ఈ కేసులలో భాగంగా దాదాపు 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. పట్టుబడిన కేసులలో అధిక శాతం లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినవే. 2024లో మొత్తం 152 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య ఇప్పటికే 220 దాటిపోయింది. అంటే దాదాపు 100 కేసులు అదనంగా నమోదయ్యాయి.ఈ ఏడాది దాడులలో కొన్ని శాఖలకు చెందిన అధికారులు అక్రమ సంపాదనలో రికార్డులు సృష్టించారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ విభాగాల్లో అత్యధికంగా లంచం కేసులు వెలుగుచూశాయి. భూముల వ్యవహారాలు, ప్రాజెక్టుల బిల్లుల క్లియరెన్స్ కోసం సామాన్యులను వేధించిన అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. ఇటీవల రవాణా శాఖలో జరిగిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఒకే అధికారి వద్ద వందల కోట్ల అక్రమాస్తులు బయటపడటం అధికారులనే విస్మయానికి గురిచేసింది. కేవలం లంచం మాత్రమే కాకుండా.. అక్రమంగా కోట్లు కూడబెట్టిన 17 మంది పైగా ఉన్నతాధికారులపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదయ్యాయి. వీరి నుండి కేజీల కొద్దీ బంగారం, భారీగా నగదు, స్థిర ఆస్తులను ఏసీబీ సీజ్ చేసింది.అవినీతి రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఫిర్యాదులను స్వీకరించడానికి వాట్సాప్,టోల్ ఫ్రీ నంబర్లను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల బాధితులు భయం లేకుండా ముందుకు వస్తున్నారు. లంచగొండి అధికారులను అరెస్ట్ చేయడమే కాకుండా.. వారిని సర్వీసు నుండి తొలగించేలా..

వారి ఆస్తులను జప్తు చేసేలా చట్టపరమైన చర్యలను వేగవంతం చేశారు.ఏదైనా ప్రభుత్వ పని కోసం అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. లంచం ఇవ్వడం కూడా నేరమేనని.. అందుకే వ్యవస్థను ప్రక్షాళన చేయడంలో ప్రజలు సహకరించాలని కోరుతున్నారు. ఏసీబీ చేపట్టిన ఈ మెరుపు దాడులతో ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లోని అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

# అమెరికాకు భారీగా తగ్గిన భారత విద్యార్థులు..

## రెండేండ్లలో 63 శాతం తగ్గుదల...



న్యూఢిల్లీ: భారతీయ విద్యార్థులకు అమెరికా విద్యపై మోజు తగ్గుతున్నది. వీసా నిబంధనలు, పెరిగిన వ్యయం, తగ్గిన ఉపాధి అవకాశాల నేపథ్యంలో భారత విద్యార్థులు అమెరికా యూనివర్సిటీ లకు బదులుగా యూరప్‌వైపు తమ దృష్టి మరల్చారు. గత రెండేం డ్లలో ఉన్నత విద్య కోసం అమెరికాను ఎంచుకొనే భారత విద్యార్థుల సంఖ్య 63% తగ్గినట్టు విద్యారుణాలు అందించే జ్ఞాన్‌ధన్ సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. విదేశాల్లో చదువుకోవాలనుకొనే భారత విద్యార్థుల్లో అమెరికాను ఎంచుకొనే వారు 2023లో 54% మంది ఉండగా అది 2025 నాటికి 20 శాతానికి పడిపోయినట్టు ఆ వివరాలు తెలుపుతున్నాయి. అమెరికాలో ఇటీవల అమలులోకి వచ్చిన కఠిన వీసా నిబంధనలు, పెరిగిన ఖర్చులు, విద్యానంతరం ఉపాధి అవకాశాలకు గ్యారెంటీ లేకపోవడం వంటి అంశాలు విద్యార్థులను యూరప్ వైపు మరలుస్తున్నాయని జ్ఞాన్‌ధన్ సీఈవో అంకిత్ మెహ్రా పేర్కొన్నారు. హెచ్-1బీ వీసా ఫీజు పెంపుదల, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఓపీటీ) సమీక్షలు వంటి అంశాలు విద్యార్థులను ప్రత్యామ్నాయాలవైపు దృష్టి సారించేలా చేశాయని తెలిపారు. ఎక్కువ మంది భారత విద్యార్థులు యూరప్‌లోని జర్మనీ, ఐర్లాండ్,ఫ్రాన్స్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు.

తమ వద్ద ట్యూషన్ ఫీజులు తక్కువని, విద్య అనంతరం ఉపాధి విధానాలను సరళీకరించామని చెప్తూ జర్మనీ విదేశీ విద్యార్థులను ఆకర్షిస్తున్నది. 4%నుంచి 2025 నాటికి 9 శాతానికి పెరిగిం ది. విదేశాల్లో చదువుకోవాలనుకొనే భారత విద్యార్థుల్లో 39% మందిబ్రిటన్‌ను ఎంచుకొంటుండగా ఈ ఏడాది వారి సంఖ్య 143 శాతం పెరిగింది. మరోవైపు కెనడా వైపు వెళ్లే వారి సంఖ్య సైతం 11% నుంచి 2.33 శాతానికి తగ్గిపోగా ఆస్ట్రేలియాను ఎంచుకొనే వారి సంఖ్య స్థిరంగా 7% వద్ద ఉన్నది.


## పావురాలకు గింజలు చల్లిన వ్యక్తికి 5వేల జరిమానా

ముంబై: బహిరంగ ప్రదేశంలో పావురాలకు తిండి గింజలు చల్లిన ఓ ముంబై వ్యాపారవేత్తకు స్థానిక కోర్టు 5 వేల జరిమానా విధించింది. ప్రమాదకరమైన వ్యాధులు వ్యాప్తి చెందడానికి అతను కారణం అవుతున్నట్లు కోర్టు పేర్కొన్నది. ముంబై నగరంలో అనేక ప్రాంతాల్లో పావురాలకు గింజలు చల్లడంపై మున్సిపాల్టీ నిషేధం విధించింది. పావురాలకు గింజలు వేయడం ఓ న్యూసెన్స్‌గా మారిందని, ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతోందని మున్సిపాల్టీ ఆ నిర్ణయం తీసుకున్నది. అయితే మూసివేసిన ఖబూతర్‌ఖాన్ వద్ద దాదార్‌కు చెందిన 52 ఏళ్ల వ్యక్తి నితిన్ సేత్ ఆగస్టు ఒకటో తేదీన పావురాలకు తిండి గింజలు వేశాడు. అదనపు చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ వీయూ మిసాల్ అతన్ని దోషిగా తేల్చారు. అయితే క్షమాపణ కోరడంతో అతనికి కోర్టు 5 వేల జరిమానా విధించింది.

# వేతనం ఆధారంగా హెచ్1-బీ

## 2026లో కొత్త నిబంధనలతో వీసాల జారీకి కసరత్తు

### 'లాటరీ' విధానంలో మార్పులపై తుది సమీక్ష చేస్తున్న అమెరికా




వాషింగ్టన్: విదేశీ వృత్తి నిపుణులకు ఇస్తున్న 'హెచ్1-బీ' వీసా ఎంపిక ప్రక్రియలో సమూల మార్పులు ప్రతిపాదిస్తూ ట్రంప్ సర్కార్ చేపట్టిన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. సరికొత్త వీసా విధానంపై 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ' ప్రతిపాదనలు రూపొందించగా, వాటిపై (హెచ్1-బీ లాటరీ సిస్టం) తుది సమీక్ష మొదలైంది. నైపుణ్యం, వేతనాల ఆధారిత లాటరీ వ్యవస్థ కోసం రూపొందించిన నిబంధనలను 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' సమీక్షిస్తున్నది. ఫెడరల్ నిబంధనల మార్పులపై సమీక్షను చివరి దశగా పరిగణిస్తారు. ఇక్కడ ఆమోదం పొందిన తర్వాత నిబంధనలు ఖరారు చేసి వాటిని ప్రకటిస్తారు. సమీక్షను పూర్తి చేసి తుది నిబంధనలకు సంబంధించి అడ్వాన్స్ కాపీని త్వరలోనే విడుదల చేయనున్నట్టు సమాచారం. వచ్చే ఏడాది నుంచే హెచ్-1బీ వీసాల జారీకి ఈ కొత్త నిబంధనలను అమలు చేయాలని అమెరికా సర్కార్ భావిస్తున్నది. అమెరికన్లకు ప్రాధాన్యం!: అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించేలా అగ్రరాజ్యం కొత్త మార్పులు తీసుకురానున్నది. ప్రస్తుతం హెచ్-1బీ వీసాల జారీకి కంప్యూటరైజ్డ్ లాటరీ విధానాన్ని అనుసరిస్తుండగా, ఇకపై 'వెయిటెడ్ సెలెక్షన్ సిస్టమ్'ను ప్రవేశ పెట్టనున్నారు. దీని ప్రకారం ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించటం, వేతన వర్గీకరణ ఆధారంగా దరఖాస్తులను విభజించటం వంటివి చేయనున్నారు. అంటే ఇకపై అధిక వేతనం కలిగిన ఉద్యోగులకు హెచ్-1బీ వీసా లు ఎక్కువగా దక్కే అవకాశం ఉంటుంది. పీఈఆర్ఎం ద్వారా గ్రీన్‌కార్డుకు దరఖాస్తులు: పీఈఆర్ఎం ప్రోగ్రామ్ ద్వారా యూఎస్ గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియను పునః ప్రారంభిస్తున్నట్టు గూగుల్ ప్రకటించింది. 2023లో భారీ తొలగింపుల మధ్య ఆగిపోయిన ఈ ప్రక్రియను పునః ప్రారంభించాలని కంపెనీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు బిజినెస్ ఇన్‌సైడర్ వార్తా కథనం తెలిపింది. టెక్ ఉద్యోగుల వీసాలపై ప్రస్తుతం పూర్తి అనిశ్చితి నెలకొన్న క్రమంలో కంపెనీ తన ఇమిగ్రేషన్ పాలసీలో మార్పు చేస్తున్నామన్న విషయాన్ని ఉద్యోగులతో పంచుకుంది. పీఈఆర్ఎం అంటే ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్. ఇది అమెరికా ప్రభుత్వ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్. ఒక విధంగా చెప్పాలంటే అమెరికాలోని ఏదైనా కంపెనీ విదేశీ ఉద్యోగులను శాశ్వతంగా నియమించుకోవాలంటే అది అమెరికా ప్రభుత్వం నుంచి పీఈఆర్ఎం లేబర్ సర్టిఫికేషన్ పొందాలి.
ఆ ఉద్యోగానికి అర్హులైన అమెరికా పౌరులు, గ్రీన్‌కార్డు దారులు లేరని నిరూపించడం, విదేశీ ఉద్యోగులను నియమించడం ద్వారా అమెరికా పౌరులకు నష్టం కలగదని నిర్ధారించడం ఈ సర్టిఫికేషన్ ముఖ్య ఉద్దేశం. గత మూడేండ్లుగా ఈ విధానాన్ని
నిలిపివేసిన గూగుల్ ట్రంప్ కఠిన వీసా నిబంధనల కారణంగా పునరుద్ధరించాలని నిర్ణయించింది. 2023లో 12వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికిన క్రమంలో ఆ ఏడాది జనవరి నుంచి పీఈఆర్ఎం దరఖాస్తులను కూడా గూగుల్ నిలిపివేసింది. ఆ సమయంలో అమెజాన్, మెటా లాంటి దిగ్గజ టెక్ కంపెనీలు కూడా ఆ కార్యక్రమాన్ని నిలిపివేశాయి. ప్రస్తుతం పీఈఆర్ఎం-2026కు దరఖాస్తు చేసుకునే ఉద్యోగులకు కఠినమైన అర్హతా ప్రమాణాలను కంపెనీ నిర్దేశించినట్టు తెలిసింది.

## మైలార్‌దేవ్‌పల్లిలో ఆపరేషన్ చబుత్ర..

### అర్ధరాత్రి రోడ్లపై తిరిగేవారికి పోలీసుల వార్నింగ్




**హైదరాబాద్,తెలంగాణ దిశ :**రాత్రిపూట పెరుగుతున్న నేరాలు, న్యూఇయర్ దగ్గరి కొస్తున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేం దుకు హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్రను చేపట్టారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ, వీధుల్లో కూర్చొని ముచ్చట్లు పెడుతున్న వారికి వార్నింగ్ ఇచ్చారు. నిబంధనలు పాటించకుండా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా తెరిచి ఉన్న హెూటళ్లు, పాన్‌షాపులను మూసివేయించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ చబుత్ర నిర్వహించినట్లుగా ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు.

### జగన్‌కు జ్వరం..కార్యక్రమాలు రద్దు

పులివెందుల, : వైసిపి అధినేత వైఎస్.జగన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో బాధపడుతున్న కారణంగా డాక్టర్ల సూచన మేరకు బుధవారం)కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఈ మేరకు వైసిపి ఎక్స్ వేదికగా ఈ ప్రకటనను విడుదల చేసింది. పులివెందుల పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ ఇడుపులపాయలో ప్రార్థనల్లో పాల్గొనాల్సి ఉంది. అలాగే, మధ్యాహ్నం పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా, అనారోగ్యం కారణంగా ఈ కార్యక్రమాలు రద్దయ్యాయి. క్రిస్మస్ సందర్భంగా గురువారం పులివెందుల సీఎస్ఐ చర్చి క్రిస్టమస్ వేడుకల్లో వైఎస్ జగన్ పాల్గొనే అవకాశం ఉంది.

# సీమలో సైలెంట్ వేవ్..


**కర్నూలు,తెలంగాణ దిశ :**రాయలసీమలో వైసీపీ క్రమంగా పుంజుకునట్లు కనిపిస్తుంది. కూటమి పార్టీ నేతల్లో విభేదాలతో పాటు వైసీపీ పట్ల సానుకూలత ఒకరకంగా వైసీపీకి వచ్చే ఎన్నికల్లో కలసి వచ్చే అంశంగా కనిపిస్తుంది. రాయలసీమలో మొత్తం యాభై రెండు శానససభ నియోజకవర్గాలున్నాయి. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతో పాటు పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పాటు రాజధాని అమరావతికే తెచ్చిన రుణాలన్నీ పెడుతున్నారన్న ప్రచారం కూడా కూటమి పార్టీలకు ఇబ్బందికరంగా మారిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో ఒక ఊపు ఊపిన కూటమి ఈసారి మాత్రం కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయని ఖచ్చితంగా చెప్పాలి. అందులోనూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావం కూడా కూటమి పై ప్రతికూలత చూపుతుందని అంటున్నారు.గత ఎన్నికల్లో కర్నూలులో పథ్నాలుగు స్థానాలుంటే రెండు స్థానాల్లో మాత్రమే వైసీపీ గెలిచింది. అది కూడా ఆలూరు, మంత్రాలయంలో మాత్రమే ఫ్యాన్ పార్టీ గలిచింది. ఆదోనిలో బీజేపీ, మిగిలిన పదకొండు నియోజకవర్గాల్లో టీడీపీ విజయం సాధించింది. అనంతపురం జిల్లాలో పథ్నాలుగు నియోజకవర్గాలుంటే కూటమి గత ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. ధర్మవరంలో మాత్రం బీజేపీ గెలిచింది. మిగిలిన పదమూడు చోట్ల టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. కడపలో పది నియోజకవర్గాలుంటే అందులో మూడింటిలో వైసీపీ మిగిలిన చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ గెలుచుకున్నాయి. వైసీపీ బద్వేలు, కడప, మైదుకూరుల్లో మాత్రమే గెలిచింది. ఇక చిత్తూరు జిల్లాలో పథ్నాలుగు నియోజకవర్గాలుంటే రెండింటిలో మాత్రమే వైసీపీ గెలిచింది. తంబళ్లపల్లి, పుంగనూరులో వైసీపీ గెలుపొందగా తిరుపతిలో జనసేన గెలిచింది. ఇప్పటికే కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పరిస్థితులు మారాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇక్కడ కూటమి నేతలు యాక్టివ్ గా లేకపోవడంతో పాటు వైసీపీ నేతలు క్రమంగా బలం పుంజుకుంటున్నట్లు కనపడుతుంది. ఇక వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వైసీపీ మరింత బలపడే అవకాశాలున్నాయని అంటున్నారు. వేవ్ ఇప్పుడు సీమ జిల్లాల్లో మారిందన్నది నిఘా వర్గాలు కూడా ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం. ప్రజల్లో అధికార పార్టీపై ఎప్పుడూ అసంతృప్తి ఉంటుంది. అది ప్రతిపక్ష పార్టీకి కొంత అనుకూలంగా మారుతుంది. మరొకవైపు జగన్ ను సీమ ప్రాంత వాసిగా చూడటంతో మరికొంత ప్లస్ అయిందని అంటున్నారు.మరి చివర వరకూ ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం రాయలసీమలో కూటమికి కష్టాలు.. వైసీపీకి వేవ్ మామూలుగా ఉండవన్న విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

# మూడేళ్ల ముందు నుంచే టికెట్ల లొల్లి

మహబూబ్ నగర్, : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు పీక్ లెవల్‌కు చేరాయి. కారు పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో క్యాడర్ రెండుగా చీలిపోయిందన్న టాక్ వినిపిస్తోంది. షాద్ నగర్ నియోజకవర్గంలో 2014, 2018లో రెండు సార్లు ఘన విజయం సాధించిన గులాబీ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైంది. గత రెండేళ్లుగా పార్టీ వర్గ విభేదాలతో కొట్టుమిట్టాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఏ మాత్రం పొసగడం లేదు. అంజయ్య యాదవ్, నవీన్ రెండు వర్గాలుగా విడిపోవడంతో ద్వితీయస్థాయి నేతలతో పాటు కార్యకర్తలు అయోమయంలో పడ్డారట. అధికార పార్టీ మీద పోరాడాల్సింది పోయి..సొంత పార్టీలో ఈ కుంపటి ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట గులాబీ పార్టీ కార్యకర్తలుమాజీ ఎమ్మెల్యే అంజయ యాదవ్ ఈ సారి తన కుమారుడికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ట్రై చేస్తున్నారట.
నవీన్ రెడ్డి ఎమ్మెల్యే సీటుపై కన్నేయ దంతో తమ సీటుకు ఎసరు వస్తుందన్న ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నవీన్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ తరపున స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలవడంతో ఆయనపై బీఆర్ఎస్ అధిష్టానానికి మంచి అభిప్రాయం ఉండటంతో పాటు ఆర్థికంగా రాజకీయంగా అన్ని విధాల నవీన్ కుమార్ బలంగా ఉండటంతో స్పీడు పెంచారు. ఇదే ఇప్పుడు అంజయ్య యాదవ్ వర్గంలో ఆందోళన కు కారణమవుతోందని తెలుస్తోంది.ఎమ్మెల్సీ హోదాలో ఉన్న నవీన్ రెడ్డి..హైదరాబాద్‌లోని పార్టీ ఆఫీస్ మొదలుకొని షాద్‌నగర్ వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ప్రజల దృష్టిలో, అధిష్టానం దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారట. అంతేకాదు బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలకు షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించడంతో..కేటీఆర్ కూడా నవీన్ రెడ్డిని అభినందించారట. ఇది మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌వర్గానికి ఏ మాత్రం రుచించడంలేదంటున్నారు.అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోదన్న టాక్ వినిపిస్తోంది. లేటెస్ట్‌గా జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ ఓ వైపు అంజయ్య యాదవ్, మరోవైపు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఎవరికి వారు సెపరేట్‌గా.. తమ వర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దింపి చాలా వరకు గెలిపించుకున్నారు. అయితే అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి వర్గ పోరు పార్టీకి డ్యామేజ్ చేస్తుందన్న ఆందోళన క్యాడర్ కనిపిస్తోందట. ఇంకా కొన్ని పంచాయితీల్లో గెలవాల్సి ఉన్నా అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి విభేదాలతో అధికార కాంగ్రెస్‌కు మేలు జరిగిందని అంటున్నారు. ఇక షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ మద్దతుదారులుగా బరిలో నిలిచి గెలిచిన సర్పంచ్‌లను తెలంగాణ భవన్‌లో సన్మానించారు కేటీఆర్.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరు కాలేదు. అంతే కాకుండా ఈ సమావేశంలో అంజయ్య యాదవ్ మళ్లీ భారీ మెజార్టీతో గెలుస్తారని కేటీఆర్ చెప్పడంతో మళ్లీ ఆయనకే టికెట్ అని చెప్పకనే చెప్పారన్న చర్చ మొదలైంది. ఇంకా ఎన్నికలకు మూడేళ్ల సమయం ఉండగానే..
మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ టికెట్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. అప్పటి వరకు పరిస్థితు ల్లో మార్పు వచ్చి తనకే టికెట్ వస్తుందన్న ధీమాతో నవీన్ రెడ్డి ఉంటే..అధిష్టానం ఆశీస్సులు తనకే ఉన్నాయని అంజయ్య యాదవ్ చెప్పుకుంటున్నారట. మొత్తానికి షాద్‌నగర్ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గాల మధ్య కార్యకర్తలు నలిగిపోవాల్సి వస్తుందట. మాజీ ఎమ్మెల్యే వెంట నడవా లో..ఎమ్మెల్సీ చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనాలో తెలియక గులాబీ పార్టీ కార్యకర్తలు సతమతం అవుతున్నారని అంటున్నారు.

# పావు వంతు లెక్చరర్లతో చదువు సాగేదెలా..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల పరిస్థితి దారుణంగా తయారైంది. సరిపడ బోధనా సిబ్బంది లేక సర్కారు కాలేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఉన్నత విద్యను ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాళీ అవుతున్న పోస్టులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేయకపోవడంతో డిగ్రీ కాలేజీల్లో బోధించే అధ్యాపకుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది.రెగ్యులర్ అధ్యాపకులను నియ మించకుండా వారి స్థానంలో గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించుకొని నెట్టుకొస్తున్నారు. కాలేజీల్లో సరి పడా సిబ్బంది లేకపోవడంతో తమ పిల్లలను ఆ కాలేజీల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు పెద్దగా సుముఖత చూపించడంలేదు. డిగ్రీ కాలేజీల్లోని కీలక పోస్టులైన ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 149 డిగ్రీ కాలేజీలుంటే, వీటిలో 4,520 పోస్టులకు పనిచేస్తున్నది మాత్రం కేవలం 1,695 మందే. 2,825 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇందులోనూ 2,570 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఈ 2,570 పోస్టుల్లో 50 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, మరో 50 శాతం జూనియర్ లెక్చరర్లను ప్రమోషన్ల ద్వారా భర్తీచేస్తారు. అంతేకాకుండా



145 ప్రిన్సిపాల్ పోస్టులకు గానూ ప్రస్తుతం పని చేస్తున్నది కేవలం 84 మందే.మిగతా పోస్టులు ఖాళీనే. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 133 ఉంటే కేవలం 23 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 110 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులను ఆటలు ఆడించే పరిస్థితే లేదు. లైబ్రేరియన్ పోస్టులు 133 ఉంటే, ఏకంగా 90 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పనిచేస్తున్నది 43 మంది మాత్రమే. ఇలా ప్రధాన పోస్టుల్లో సిబ్బంది లేక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కునారిల్లుతున్నాయి. ఉన్నవారినే ఇన్‌చార్జిలుగా పెట్టి కళాశాలలను నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. సరిపడ అధ్యాపకులు కాలేజీల్లో లేకపోవడంతో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపడంలేదు. పేరున్న మంచి కాలేజీల్లో సీట్లు నిండితున్నా మిగతా కాలేజీల్లో అయితే నిండడం కష్టంగానే మారింది. ఈ ఏడాది కాలేజీల్లో సీట్లు అంతంత మాత్రంగానే నిండాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో దాదాపు 90 వేల సీట్లుంటే 51 వేల అడ్మిషన్లు మాత్రమే నిండాయి.సిబ్బంది కొరత, సరైన వసతుల్లేకపోవడంతో ఇంటర్ తర్వాత చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లోనే చేరుతున్నారు. ప్రైవేట్ కాలేజీల్లో దాదాపు 1.22 లక్షల మంది చదువుతున్నారు. ప్రైవేట్ వైపు విద్యార్థులు మళ్లకుండా ఉండాలంటే ప్రభుత్వం అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతోపాటు కాలేజీల్లో ల్యాబ్‌లు, ఇతర వసతులను కల్పించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### అనుచరుడి చాయి దుకాణం ప్రారంభించిన మంత్రి..

మక్తల్: నేడు ఉదయం మంత్రి వాకిటి శ్రీహరి అనుచరుని చాయి దుకాణం ప్రారంభించారు. వాకిటి మాట్లాడుతూ.. మంత్రిగా ప్రారంభించింది చిన్నదే అయిన ఒకరికి ఉపాధి కల్పించాలన్న తృప్తి ఉందన్నారు. తనను నమ్ముకుని తన చేతి కింద పని చేసిన వారందరికీ ఉపాధి కల్పించడంలో భాగంగా ఎప్పుడు రద్దుగా ఉండే బస్టాండ్ ఏరియాలో నారాయణ పేట ఆర్టీసీడిఎంతో మాట్లాడి.. బస్టాండ్ ముందు నెలవారి కిరాయి బేస్ మీద టీ కొట్టును సాగించేలా అధికారికంగా ఉత్తర్వులు తీసుకుని టీ కొట్టు ఏర్పాటు చేయడానికి ఆర్థిక సాయం చేశారు. రాజకీయంగా వెనుక తిప్పుకుని అవసరం అయిపోగానే గాలికి వదిలేసే ఈ రోజుల్లో అనుచరులకు ఉపాధి చూపించిన మంత్రి మంచితనాన్ని జనాలు మెచ్చుకుంటున్నారు.

# కలకలం రేపుతున్న ఎఫ్ స్టీన్ ఫైల్స్

న్యూఢిల్లీ, : ప్రపంచవ్యాప్తంగా ఎఫ్ స్టీన్ ఫైల్స్ ఎంతటి సంచలనం సృష్టిస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ వ్యవహారంలో వేలాది ఫోటోలు ఉన్నాయని.. ప్రపంచస్తంగా పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వ్యక్తులంతా ఇందులో ఉన్నారని అమెరికా మీడియాలో ప్రధానంగా వార్తలు వస్తున్నాయి. దీనికి తోడు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ నుంచి మొదలు పెడితే.. ట్రంప్ వరకు అందరూ ఉండడంతో ఒక్కసారిగా కలకలం నెలకొంది.ఇటీవల అమెరికా మీడియాలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ఫోటోలు దర్శనమిచ్చాయి. అతడితో పాటు కొంతమంది అమ్మాయిలు కూడా ఉన్నారు. కొన్ని ఫోటోలు అత్యంత దారుణంగా ఉన్నాయని.. అవి బయట పెడితే ఆ ప్రముఖుల అసలు గుట్టు బయటపడుతుందని చాలామంది అనుకున్నారు. అయితే ఇందులో కొంతమేర మతలబు చోటుచేసుకుంది. అంతేకాదు ట్రంప్ ఫోటోలు కూడా మాయమయ్యాయి. దీంతో తెరవెనక ఏదో జరిగి ఉంటుందని అందరు అనుకున్నారు. అయితే ఊహించని విధంగా సోమవారం తెల్లవారుజామున కొన్ని ఫోటోలు బయటకు రావడంతో మరోసారి కలకలం ఏర్పడింది.ఎప్ స్టీన్ వ్యవహారానికి సంబంధించిన దాదాపు 16 ఫైల్స్ మాయమైనట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు కొద్దిరోజులుగా వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే వీటిలో న్యాయశాఖ సంబంధించిన వెబ్ పేజీ నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోటో మళ్లీ ప్రత్యక్షమైంది. కొద్ది రోజులు ఈ ఫోటో మిస్ అయినట్టు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి.
ఈ ఫోటోకు సంబంధించి తాత్కాలికంగా రివ్యూ కోసమే తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు చెప్పడం గమనార్హం. అయితే ఆ ఫోటోలో ట్రంప్ తన భార్య మెల్లనియ, ఎప్ స్టీన్, అతడి స్నేహితురాలు గిస్లైన్ మాక్స్ వెల్ కనిపించారు.ట్రంప్ ఫోటో మాయం వెనక అమెరికాను ఆశాక అధికారులు స్పందించారు. ఈ వ్యవహారంలో ఉన్న యువతులకు సంబంధించిన గుర్తింపులు, ఇతర వ్యవహారాలు బయటికి రాకుండా ఉండడానికి చర్యలు తీసుకున్నామని.. దాని సమీక్ష కోసం ట్రంప్ ఫోటో బయటికి రాకుండా తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే ఇదంతా తాత్కాలికంగానే చేశామని.. ఈ కేసులో ఎవరైతే బాధితులుగా ఉన్నారో.. వారిని మాత్రమే తాము రక్షించడానికి దస్త్రాలలో సవరణలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎవరి వైపు తాము పక్షపాతం ప్రదర్శించడం లేదని.. సమరూపకంతోనే వ్యవహరిస్తున్నామని వెల్లడించారు.

# గృహ నిర్మాణానికి కేటాయింపుల్లో 68% కోత

## - 2025-26 బడ్జెట్ రూ.6,317 కోట్లను రూ.2,017 కోట్లకు తగ్గింపు



అమరావతి : పేదల ఇళ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం వెనుకడుగు వేసింది. పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెబుతూనే, మరోపక్క ఇందుకు అవసరమైన నిధుల కేటాయింపుల్లో మాత్రం తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని బడ్జెట్ ప్రతిపాదనలు పరిశీలిస్తే స్పష్టమవుతుంది. తాజాగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం గృహ నిర్మాణానికి కేటాయించిన నిధులు పెంపు లేకపోవడం, గత బడ్జెట్‌లో కేటాయింపులను సవరించి 68.07 శాతం వరకూ తగ్గించడం వంటి అంశాలను పరిశీలిస్తే ప్రభుత్వం తీరుకు అద్దం పడుతుంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025-26 బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకాలకు రూ.6,317.77 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించినప్పటికీ రూ.2017.41 కోట్లకు సవరించింది. వచ్చే ఏడాది (2026-27) బడ్జెట్‌లో ఇందుకు రూ.6,357.30 కోట్లు కేటాయించడం గమనార్హం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం వాస్తవంగా ఖర్చు చేసిన మొత్తం రూ.1,550.74 కోట్లు మాత్రమే ఉంది. ఈ ఏడాది మార్చి నాటికి 5 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించారు. వచ్చే మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అందరికీ ఇళ్లు అందజేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనలకు తగ్గట్టుగా బడ్జెట్‌లో కేటాయింపులు కనిపించడం లేదు. గృహ నిర్మాణంలో వివిధ పథకాలకు గతంలో ఖర్చు చేసిన మొత్తం కంటే ప్రస్తుతం బడ్జెట్ (2025-26) సవరించిన అంచనాల్లో తగ్గించారు. పిఎంజిఎవై (అర్బన్ 2.0)కు గత బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోగా, సవరించిన అంచనాల్లో కేవలం రూ.23.52 కోట్లుగా పేర్కొన్నారు. వచ్చే ఏడాది బడ్జెట్ (2026-27)లో ఈ పథకానికి రూ.575.47 కోట్లుగా కేటాయించారు. పిఎంఎవై (అర్బన్ బిఎల్‌సి)కి గతేడాది బడ్జెట్‌లో రూ.4,637.23 కోట్లుగా ఘనంగా చూపించినా, దానిని ప్రస్తుతం సవరించి రూ.517 కోట్లకు తగ్గించారు. పిఎంఎవై (గ్రామీణ్) పథకానికి 2024-25లో వాస్తవంగా పెట్టిన ఖర్చు రూ.361 కోట్లుగా ఉండగా, 2025-26 బడ్జెట్‌లో రూ.602.30 కోట్లు కేటాయించి, ప్రస్తుతం సవరించి రూ.210.55 కోట్లకు తగ్గించారు. పిఎం జన్‌మాన్‌కు 2024-25లో వాస్తవంగా చేసిన ఖర్చు రూ.28.32 కోట్లు మాత్రమే. 2025-26లో ఇందుకోసం రూ.225 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం సవరించి రూ.335.97 కోట్లకు పెంచారు. ఈ బడ్జెట్‌లో రూ.685.70 కోట్లు కేటాయించారు. వీకర్ సెక్షన్ హౌసింగ్ పథకానికి 2024-25 ఏడాది వాస్తవ ఖర్చు రూ.260.56 కోట్లుగా ఉండగా, 2025-26 బడ్జెట్‌లో రూ.326.63 కోట్లు కేటాయించారు. సవరించిన అంచనాల్లో ఇంతే మొత్తం దక్కింది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకానికి కోత వేసి రూ.287.76 కోట్లు మాత్రమే కేటాయించారు. పిఎంఎవై అర్బన్ ఇళ్ల జియో ట్యాగింగ్‌కు రూ.4.94 కోట్లు కేటాయించగా, గృహ నిర్మాణ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 2025-26లో కేటాయింపులు లేకపోగా, సవరించిన అంచనాల్లో రూ.87 కోట్లు చూపించారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఇందుకు రూ.300 కోట్లు కేటాయించారు. గృహ నిర్మాణ సంస్థ రుణాలు 2025-26లో రూ.509.42 కోట్లుగా ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.491.22 కోట్లుగా ప్రతిపాదించారు.

# రకాల మెంబర్ షిప్ తో జనసేన

## జనసేన పార్టీ

విజయవాడ, : జనసేన పార్టీ తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించేందుకు సరికొత్త సభ్యత్వ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో పార్టీలో మూడు రకాల సభ్యత్వ వర్గాలను నిర్ణయించింది. జనసేన పార్టీ తన శ్రేణులను మూడు విభాగాలుగా విభజించింది. మొదటి వారిని ఉద్యమి గా పిలుస్తారు. వీరు పార్టీపై నమ్మకం, అభిమానంతో ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న వారు. రెండవ కేటగిరీకి చెందిన వారిని సాధక్ అని పిలుస్తారు. వీరు కేవలం సభ్యులుగానే కాకుండా, పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ, పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఇక మూడవ కేటగిరీలోకి ప్రధాతలు వస్తారు. వీరు పార్టీకి వివిధ రూపాల్లో ఆర్థికంగా లేదా మేధోపరంగా అండగా నిలుస్తూ, నాయకత్వ బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారు.సభ్యత్వ నమోదు ప్రక్రియను పారదర్శకంగా మరియు సులభంగా నిర్వహించేందుకు జనసేన పార్టీ డిజిటల్ పద్ధతులను అవలంబిస్తోంది. ప్రతి సభ్యుని వివరాలను ఆన్‌లైన్ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా, భవిష్యత్తులో వారికి ఇన్సూరెన్స్ వంటి ప్రయోజనాలను అందించాలని పార్టీ భావిస్తోంది. ముఖ్యంగా యువత ను ఈ ఉద్యమి-సాధక్-ప్రధాత ' విధానం వైపు ఆకర్షించడం ద్వారా పార్టీలో జవాబుదారీతనం పెరుగుతుందని నాయకత్వం ఆశిస్తోంది. ఏపీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి గ్రామం, వార్డులో జనసేన జెండాను రెపరెపలాడిం చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. సాధారణ సభ్యుల నుండి నాయకుల వరకు వారి పనితీరు , అంకితభావాన్ని బట్టి ఈ వర్గీకరణ లో గుర్తింపు లభిస్తుంది. ఈ నూతన విధానం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపడంతో పాటు, క్రమశిక్షణతో కూడిన రాజకీయ వ్యవస్థను నిర్మించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు.

# 15 ఏళ్ల అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

హైదరాబాద్: మీకు 14 ఏళ్లు నిండి 15 ఏళ్ల వయసున్న అమ్మాయిలు ఉన్నారా? అయితే మీకో అలర్ట్. త్వరలోనే తెలంగాణ ప్రభుత్వం మీ అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేయించనుంది. రాష్ట్రంలో మొత్తం 4 లక్షల మందికిపైగా ఈ వయసు ఉన్న కిశోర బాలికలు ఉన్నారని గుర్తించారు. వీరందరికీ టీకాలు వేయనున్నారు. అసలు ఈ వ్యాక్సిన్ ఎందుకు వేయిస్తారు..మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 14 నుంచి 15 ఏళ్ల వయసున్న బాలికల కోసం కేంద్రంతో కలిసి ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ వయసున్న బాలికలు రాష్ట్రంలో 4 .60 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వ్యాక్సినేషన్ చేపట్టడానికి ముందు మైక్రో ప్లానింగ్ సర్వే నిర్వహించనున్నారు. దీని ద్వారా ఈ వయసున్న అమ్మాయిలు స్కూళ్లలో ఎంత మంది ఉన్నారు, బయట ఎంత మంది ఉన్నారనే వివరాలను సమగ్రంగా సేకరిస్తారు.తెలంగాణలోని క్యాన్సర్ కేసులను పరిశీలిస్తే.. మహిళల్లో ఎక్కువ మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతుండగా.. ఆ తర్వాతి స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉంది. దీన్నే సర్వైకల్ క్యాన్సర్ అని పిలుస్తారు. హెచ్‌పీవీ




వ్యాక్సిన్ వేయించడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. మహిళలకు సోకే సర్వైకల్ క్యాన్సర్లలో 85 నుంచి 90 శాతం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్లే సోకుతోంది.ఎక్కువసార్లు ప్రసవాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, చిన్న వయసులోనే పెళ్లి కావడం, లైంగిక సంబంధాల వల్ల హ్యూమన్ పాపిలోమా వైరస్ సోకుతుంది. అయితే ఇది సోకిన వెంటనే క్యాన్సర్ రాదు. వైరస్ సోకిన 10-15 ఏళ్ల తర్వాత మహిళల్లో క్యాన్సర్ బయటపడుతుంది. దీంతో అమ్మాయిలు యుక్త వయసులోకి వచ్చిన తర్వాత, లైంగిక జీవితాన్ని ప్రారంభించడానికి ముందు హెచ్‌పీవీ టీకాలు వేయిస్తే.. క్యాన్సర్‌ను అరికట్టడంలో మంచి ఫలితం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు. సర్వైకల్ క్యాన్సర్ తొలి దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు అందుకే దీన్ని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారు. వ్యాధి ముదురుతున్న కొద్దీ లక్షణాలు ఒక్కొక్కటిగా బయటపడతాయి. వ్యాధి బారిన పడ్డామని గ్రహించేలోపే అది ముదిరిపోతోంది. దీని వల్ల చికిత్స ఖర్చు పెరిగిపోవడంతోపాటు ప్రాణాలు కాపాడటం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కిశోర బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం ఉత్తమ పరిష్కారంగా డాక్టర్లు చెబుతున్నారు. 30 ఏళ్ల వయసు దాటిన మహిళలు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను బయట కొనుగోలు చేయాలంటే.. ఒక్కో డోసుకు కనీసం రూ.2 వేల నుంచి గరిష్టంగా రూ.4 వేల వరకుఖర్చు చేయాల్సి వస్తుంది. 15ఏళ్లు వచ్చిన అమ్మాయిలకు మూడు డోసుల వ్యాక్సిన్ ఇస్తారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం అవుతుంది. దీంతో ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటికే ఏర్పా?ట్లు పూర్తి చేసింది. టీకాలు పంపిణీ చేసే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

## ఎన్నికల ఖర్చుల వివరాలు తెలియజేయండి

కమాన్ పూర్ : ఇటీవల జరిగిన కమాన్ పూర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఖర్చు వివరాలను తెలియజేయాలని ఎంపీడీవోకు వార్డు సభ్యులు వినతి పత్రం బుధవారం అందజేశారు. ఎన్నికలకు సంబంధించి కమాన్ పూర్ గ్రామపంచాయతీలో గత సంవత్సరం డిసెంబర్ 11 జరిగిన ఎన్నికల్లో మొత్తం ఎంత ఖర్చు జరిగిందని స్టేషనరీ సిబ్బంది భద్రత ఇతర ఖర్చుల వివరాలు ఇవ్వాలని ఆ వినతిపత్రంలో సూచించారు. ఖర్చులకు సంబంధించిన బిల్లులు వోచర్లు, ప్రతులు ఇవ్వాలని ఏ ఖర్చులు ఏ ఖాతా నుండి చెల్లించబడ్డాయని వార్డ్ సభ్యులు కోరారు. వివరాలు కోరిన వారిలో రెండవ వార్డు సభ్యుడు గుంజపడుగు నవీన్, 11వ వార్డు సభ్యుడు మెరుగు కుమార్, 12వ వార్డు సభ్యుడు గుడిసెలకు లింగస్వామి, 9వ వార్డు సభ్యుడు పచ్చినూరి రాజ్ కుమార్, ఒకటవ వార్డు సభ్యుడు మిట్టపల్లి సందీప్ 13వ వార్డు సభ్యుడు తూటి రాజులు వినతి పత్రం కోరారు.



# 3 నగరాల్లో ఫుడ్ స్ట్రీట్స్...


వరంగల్ : తెలంగాణలోని హన్మకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల ప్రజలకు గుడ్ న్యూస్. సాయంత్రం కుటుంబంతో కలిసి స్ట్రీడ్ ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఈ మూడు నగరాల్లో త్వరలోనే హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే దీని కోసం స్థలాల అన్వేషణ పూర్తి కాగా.. త్వరలోనే మిగతా ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఫుడ్ స్ట్రీట్లలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని భావించే వారు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.చాలా మందికి స్ట్రీట్ ఫుడ్ అంటే ఇష్టం. సాయంత్రం అయితే చాలు బజ్జీలు, పునుగులు, పానీపూరీ.. ఇలా ఏదో ఒకటి లాగించకపోతే మనసు ఊరుకోదు. అయితే వాటిని తయారు చేయడానికి ఎలాంటి పదార్థాలు వాడుతున్నారు? వాటిని విక్రయించే ప్రదేశాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంటాయో లేవో అనే భయం చాలా మందికి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రజలకు హైజనిక్ స్ట్రీట్ ఫుడ్ అందేలా చూడటం కోసం కేంద్రం ప్రభుత్వం కీలక ప్రయత్నం చేస్తోంది. దేశవ్యాప్తంగా 100 హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 86 సెంటర్లకు అనుమతులు ఇచ్చింది. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఒక్కో సెంటర్ కోసం కోటి రూపాయలు చొప్పున నిధులు మంజూరు చేస్తోందిఈ క్రమంలోనే తెలంగాణలోని హనుమకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో హెల్తీ అండ్ హైజనిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ నగరాల్లో ఫుడ్ స్ట్రీట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను సైతం గుర్తించారు. సామాన్య ప్రజలు ఆహారం క్వాలిటీ గురించి, అందులో వాడిన పదార్థాల గురించి ఎలాంటి భయం లేకుండా.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఫుడ్ స్ట్రీట్స్ ఉంటాయి. దుమ్ము ధూళితో ఇబ్బంది లేకుండా చూడటం కోసం, సులభంగా శుభ్రం చేసేందుకు



వీలుగా ఫుడ్ స్ట్రీట్స్ ప్రాంగణం మొత్తం టైల్స్ వేస్తారు. రాత్రి టైంలో ఆకర్షణీయమైన లైటింగ్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు.

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ ఉన్న వారికి మాత్రమే ఫుడ్ స్ట్రీట్స్‌లో స్టాల్స్ కేటాయిస్తారు. ఈటూాంఎ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూస్తారు. ఆహార పదార్థాలను ఎలా జాగ్రత్తపర్చాలి, పరిశుభ్రంగా ఎలా ఉండాలనే విషయమై వెండర్లకు ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నారు. ఈ స్టాల్స్‌లో వంట చేసే వారు, ఆహారాన్ని అందించేవారు తప్పనిసరిగా చేతులకు గ్లోవ్స్ పెట్టుకోవాలి. వెంట్రుకలు ఆహారంలో పడకుండా తలకు ఆప్రాన్ పెట్టుకోవాలి. గోర్లు పెంచుకోవడం, వేళ్లకు ఉంగరాలు పెట్టుకోవడం కుదరదు. పొగాకు నమలడం, సిగరెట్లు, బీడీలు కాల్చడం నిషేధం. ఆహార పదార్థాల తయారీకి వాడే ముడిసరుకులతోపాటు, ఫుడ్ ఐటెమ్స్ క్వాలిటీని ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు.అంతే కాదు ఈ ఫుడ్ స్ట్రీట్స్‌లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి కస్టమర్లు తాగడానికి శుద్ధ జలాన్ని అందిస్తారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి ప్రత్యేకంగా వాష్ ఏరియాలు ఉంటాయి. ఫ్యామిలీతో సరదాగా టైం గడుపుతూ, ఫుడ్‌ను ఎంజాయ్ చేయడం కోసం బెంచీలను ఏర్పాటు చేస్తారు.

# పాపం... కొణతాల..



విశాఖపట్టణం, : సీనియర్ మోస్ట్ లీడర్. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా పేరున్న నేత.. గతంలో ఓసారి మంత్రి అయ్యారు. గత రెండేళ్లుగా అమాత్య యోగంపై తెగ ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆయన అంచనాలు తలకిందులు అవుతూ వస్తున్నాయి. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఆ పొలిటీషియన్ తన స్టైల్‌ను మార్చేశారన్న టాక్ వినిపిస్తోం ది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పుడున్న పొలిటీషియన్లందరి కంటే ఆయన చాలా సీనియర్. ఒకప్పుడు జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పే వారు. 1989లోనే ఫస్ట్ టైమ్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత అదే సీటు నుంచి మరోసారి ఎంపీ అయ్యారు. ఇక 2004లో ఎమ్మెల్యే అయి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏకైక మంత్రిగా ఐదేళ్లు తన హవా నడిపించారు కొణతాల. ఇక 2009లో ఓడిపో వడంతో ఆయన పొలిటికల్ గ్రాఫ్ ఎత్తు పల్లాలు చూడాల్సి వచ్చింది. అప్పుడు గనుక కొణతాల గెలిచి ఉండి ఉంటే రాజకీయం వేరేగా ఉండేదని చెప్తుంటారు.2009లో ఓటమితో పదిహేనేళ్ల పాటు పొలిటిక ల్‌గా చాలా ఇబ్బందులను ఫేస్ చేశారు కొణతాల. అయితేనేం 2024లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలిచి మరీ కొణతాలకు సీటు ఇచ్చారు. అలా ఆయనకు తిరిగి ఎమ్మెల్యేగా చాన్స్ దక్కింది. అయితేఒకప్పుడు విశాఖ జిల్లాలో సింగిల్ హ్యాండ్ గణేష్‌లాగా హవా నడిపించిన కొణతాల..ఇప్పుడు అందరిలానే ఎమ్మెల్యేగా ఉండిపో వాల్సి వచ్చింది. కానీ బ్యాక్ గ్రౌండ్ చూస్తే మాత్రం అయ్యో..అంత పెద్ద నాయకుడు ఇలా ఉండిపోయారేంటన్న చర్చ కూడా నడుస్తుంది. అయితే ఇప్పుడు జనసేనలో సీనియర్ మోస్ట్ లీడర్లలో అనకాపల్లి జిల్లాకు చెందిన కొణతాల రామకృష్ణ ఒకరు. ఈ క్రమంలో విశాఖ జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర పాలిటిక్స్‌పై పూర్తి అవగాహన ఉన్న కొణ తాలకు మంత్రి పదవి దక్కుతుందని అంతా ఊహించారు. పైగా బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిగా ఉన్నారాయన. ఆ సామాజికవర్గానికి 25 ఏళ్ల క్రితం చివరి సారిగా మంత్రి యోగం దక్కింది. మళ్లీ ఇంతవరకూ ఆ ఛాన్స్ రానే లేదు. దాంతో విశాఖలో అనేక నియోజకవర్గాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చూపిం చగల గవర సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. కానీ అది ఎందుకో కుదరలేదు.ఇక ఈ ఏడాది మధ్యలో మంత్రి వర్గ విస్తరణ జరగబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. దాంతో అనకాపల్లి జిల్లా నుంచి కొణతాల రామకృష్ణకు జనసేన కోటాలో మంత్రి పదవి ఖాయమని టాక్ నడుస్తోంది. ప్రస్తుతం జనసేనలో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చారు. పార్టీకి మరో మంత్రిపదవి దక్కితే అది నాగబాబుకు ఇస్తారనే చర్చ ఉండేది. అయితే ఒకే కులానికి ..ఒకే కుటుంబానికి అన్ని పదవులు ఇచ్చారన్న విమర్శలు ఫేస్ చేయాల్సి వస్తుందని జనసేన అధినాయకత్వమే..నాగబాబును మంత్రి చేయాలనుకున్న డెసిషన్‌ను వెనక్కి తీసుకున్నట్లు చెబుతుంటారు. దీంతో బీసీల నుంచి కీలక నేతకు మంత్రి పదవి ఇస్తే బాగుంటుందన్న ఆలోచన జనసేనలో ఉందని అంటున్నారు. పైగా గోదావరి జిల్లాల తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాలలో జనసేనకు మంచి బలం ఉంది. ఆరు ఎమ్మెల్యే సీట్లను ఇక్కడ ఆ పార్టీ గెలుచుకుంది. ఫ్యూచర్ పాలిటిక్స్‌ను దృష్టిలో పెట్టుకుని కొణతాలకు మంత్రి పదవి ఇవ్వొచ్చన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.మంత్రి పదవి రేసులో కొణతాల ఉన్నారని చర్చ జరుగుతున్న వేళ..బడ్జెట్ సమావేశాలలో ఆయన ఏకంగా సీఎం చంద్రబాబు ఫ్యామిలీ మొత్తాన్ని పొగిడేశారు. చంద్రబాబు, లోకేశ్‌ను మాత్రమే కాదు భువనేశ్వరి, బ్రాహ్మణి, ఆఖరికి దేవాంశ్‌ను కూడా పొగడ్తలతో ముంచెత్తారు కొణతాల. ఒకే కుటుంబంలో అందరూ ప్రతిభావంతులే అని కొణతాల చెప్పుకొచ్చారు. ఈ మధ్య ఆ కుటుంబంలోని వారంతా వివిధ రంగాల్లో సత్తా చాటి అవార్డులు అందుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేసి చర్చకు తెరదీశారు. అయితే ఉన్నట్లుండి ఆయన చంద్రబాబు కుటుంబాన్ని మొత్తం పొగిడేయడం హాట్ టాపిక్ అవుతోంది. పైగా జనసేన ఎమ్మెల్యేగా ఉంటూ టీడీపీ వారి కంటే ఎక్కువగా బాబు కుటుంబాన్ని కొణతాల పొగడటం వెనక మంత్రి పదవి కోరికలు ఉన్నాయా అన్న చర్చ సాగుతోంది.కొణతాలకు మంత్రి పదవి ఇవ్వాలా? వద్దా? అనేది పవన్ నిర్ణయమని..కొణతాల చంద్రబాబును పొగిడింది మంత్రి అందుకోసమేనన్న ప్రచారం సరికాదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఏది ఏమైనా తన పొలిటికల్ ట్రాక్ రికార్డ్ లో ఎప్పుడూ రెబల్ స్టార్‌గా ఉన్న కొణతాల..గతంలో ఎప్పుడూ ఇంతలా ఎవరినీ పొగడలేదన్న చర్చ మాత్రం ఆసక్తికరంగా మారింది.

# అరుణిక సూపర్‌కంప్యూటర్‌కు ప్రొటెక్షన్ ట్యాగ్




న్యూఢిల్లీ: వ్యూహాత్మకమైన యూనిట్లకు సైబర్‌దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశంలోని వాతావరణ పరిస్థితులపై హెచ్చరికలు జారీ చేసే అత్యాధునిక అరుణిక సూపర్‌కంప్యూటర్ కు చట్టపరమైన ప్రొటెక్షన్ ట్యాగ్ లభించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అత్యాధునిక, హై పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ సూపర్‌కంప్యూటర్ అరుణికను 2024 సెప్టెంబర్‌లో ప్రధాని మోదీ ఆవిష్కరించారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఈ సూపర్‌కంప్యూటర్ అంచనా వేస్తుంది. కీలకమైన సైంటిఫిక్ కేంద్రాలకు సైబర్‌భద్రత కల్పించే ఉద్దేశంతో చర్యలు చేపట్టినట్లు భూశాస్త్ర మంత్రిత్వ కార్యాలయం పేర్కొన్నది.నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ కు చెందిన అరుణిక హై పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ సిస్టమ్‌కు రక్షణ కల్పించినట్లు ప్రభుత్వం తెలిపింది. 2000 నాటి ఐటీ చట్టంలోని సెక్షన్ 70(1)కింద అరుణిక కంప్యూటర్‌కు ప్రొటెక్షన్ ట్యాగ్ దక్కినట్లు ప్రభుత్వం వెల్లడించింది.చట్టపరమైన రక్షణ వల్ల ఆ సూపర్‌కం ప్యూటర్‌కు మరింత అదనపు భద్రత లభిస్తుంది. సున్నితమైన వాతావరణశాఖ డేటాను పరిరక్షించాలన్న ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టారు. ఒకవేళ ఎవరైనా ఆ కంప్యూటర్‌ను యాక్సెస్ చేసినా, లేక డేటాను చోరీ చేసే ప్రయత్నం చేసినా వారికి చట్టపరమైన శిక్ష ఉంటుంది. వాతావరణం, విపత్తులకు చెందిన వార్నింగ్‌ను అరుణిక హెచ్‌పీసీ సిస్టమ్ జారీ చేస్తుంది. వ్యవసాయం, వైమానికం, సముద్ర, విపత్తు సంబంధిత అంశాలకు అరుణికం కీలకం కానున్నది. కేవలం ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వశాఖకు చెందినవారు మాత్రమే అరుణిక సిస్టమ్‌ను యాక్సెస్ చేస్తారు. అరుణిక కంప్యూటర్ సిస్టమ్ నోయిడాలో ఉన్నది. వెదర్ అక్యూరెసీని అంచనా వేస్తుంది. 8.24పెటాఫ్లాప్స్ సామర్థ్యంతో దీన్ని ఆపరేట్ చేస్తారు.

# సినిమా



# మృణాల్‌తో సినిమా అంటే హీరోలు జాగ్రత్తగా ఉండాల్సిందే!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌తో సినిమాలు చేసే హీరోలు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే, సెంటిమెంట్ అలా నడుస్తుంది.ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ పేరు ఇండస్ట్రీ వర్గాల్లో ఎలా వినిపిస్తుందో తెలిసిందే. రీసెంట్‌గా ధనుష్ తో పెళ్లి అంటూ ఆమెపై వార్తలు వచ్చాయి. ఆ వార్తలకి ఎలాగోలా స్టాప్ పెట్టిన మృణాల్.. ఇప్పుడు తన సినిమాలతో చర్చల్లో నిలుస్తున్నారు. అడివి శేష్ సరసన హీరోయిన్‌గా నటించిన 'డెకాయిట్' చిత్రం థియేటర్లలో విడుదలై.. సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది.

ఈ సినిమా ప్రమోషన్స్‌లో మృణాల్ యమా యాక్టివ్‌గా పాల్గొంటున్నారు. అలా ఓ ఈవెంట్‌లో తెలుగు హీరోనే పెళ్లి చేసుకుంటుందని, మృణాల్‌పై అల్లు అరవింద్ చేసిన కామెంట్స్ బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. దీంతో తెలుగు ప్రేక్షకులు ఆమెపై ఇంకాస్త ఇంట్రెస్ట్ పెడుతున్నారు. ప్రస్తుతం 'పెద్ది' సినిమాలో స్పెషల్ సాంగ్‌కు ఈ అందాల భామ సెలక్ట్ అయినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే, తాజాగా తన సినిమాల్లోని ఒక వింత సెంటిమెంట్ గురించి ఈ భామ బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. తన స్నేహితులు తనను సరదాగా 'హస్బెండ్ మర్డరర్' (భర్తలను చంపేసే భార్య) అని ఆటపట్టిస్తుంటారని నవ్వుతూ చెప్పింది. అందుకు కారణం ఆమె నటించిన వరుస సినిమాలు, అందులో హీరోల పాత్రల ముగింపేనని అంటోంది. ఆ వివరాల్లోకి వెళితే.. హిందీ 'జెర్సీ' సినిమాలో షాహిద్ కపూర్ పాత్ర చివరికి చనిపోతుంది. 'సీతారామం' వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీలో కూడా దుల్కర్ సల్మాన్ పాత్ర ప్రాణాలు విడుస్తుంది. అలాగే 'ధమాకా'లో కార్తీక్ ఆర్యన్ పాత్ర కూడా అంతే! ఇక తాజాగా విడుదలైన 'డెకాయిట్' సినిమాలో కూడా హీరో అడవి శేష్ పాత్రకు ఇదే గతి పట్టింది. "సీతారామంలో రామ్ చనిపోయారు.. ఇప్పుడు అడవి శేష్ పాత్ర కూడా అంతే! నా సినిమాల్లో హీరోలందరినీ ఇలా చంపేస్తున్నందుకు నా ఫ్రెండ్స్ నన్ను ఆటపట్టిస్తున్నారు" అంటూ మృణాల్ సరదాగా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోకు నెటిజన్లు కూడా సరదాగా రియాక్ట్ అవుతున్నారు. మృణాల్‌తో కలిసి నటించే హీరోలు తమ పాత్రల విషయంలో కాస్త జాగ్రత్తలు తీసుకోవాలంటూ నెటిజన్లు చేసే కామెంట్స్‌తో ఈ వీడియో బాగా చక్కర్లు కొడుతోంది.

## నాన్న క్రమశిక్షణే నాకు స్ఫూర్తి..


# తండ్రిపై చరణ్ ఆసక్తికర కామెంట్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. మొదట ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకున్న ఈ మూవీని, ప్రేక్షకులకు మరింత మెరుగైన థియేట్రికల్ అనుభూతిని అందించేందుకు జూన్‌కు వాయిదా వేసారు.ఇక ఇదిలా ఉంటే, రామ్ చరణ్ మరో అంతర్జాతీయ గుర్తింపును అందుకున్నారు. ప్రతిష్టాత్మక 'ఈ స్క్వేర్ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై చోటు దక్కించుకున్న టాలీవుడ్ హీరోగా ఆయన ప్రత్యేక రికార్డ్ సృష్టించారు. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత, వృత్తిగత జీవితంపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన తండ్రి, మెగాస్టార్ చిరంజీవి ప్రభావం గురించి మాట్లాడుతూ, "నా జీవితంలో నిజమైన హీరో నాన్నే" అని గర్వంగా తెలిపారు. నాన్న వారసత్వాన్ని అందిపుచ్చుకోవడం తమకు సులభంగా అనిపించినప్పటికీ, ఆయన పడ్డ కష్టం మాత్రం అపారమని అన్నారు. సినిమాల కోసం చిరంజీవి పడే కష్టం గురించి చెబుతూ, షూటింగ్‌ల సమయంలో రోజుకు కేవలం నాలుగు గంటలు మాత్రమే నిద్రపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. అంత బిజీ షెడ్యూల్‌లో కూడా కుటుంబానికి సమయం కేటాయించడంలో ఆయన ఎప్పుడూ రాజీ పడలేదని వెల్లడించారు. ఎంతటి స్టార్‌డమ్ ఉన్నా ఇంట్లో మాత్రం సాధారణ తండ్రిలా ఉండటం చిరంజీవి ప్రత్యేకత అని కొనియాడారు. కష్టాల్లో ఉన్న సినీ పరిశ్రమ వ్యక్తులకు అండగా నిలవడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని చెప్పారు.

వృత్తిపరమైన బాధ్యతలు, కుటుంబ బంధాలను సమన్వయం చేసుకోవడం ఎలా అనేది తన తండ్రిని చూసే నేర్చుకున్నానని చరణ్ తెలిపారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగే చిరంజీవి తత్వం తనపై ఎంతో ప్రభావం చూపిందని, ప్రస్తుతం తాను కూడా అదే మార్గాన్ని అనుసరిస్తున్నానని పేర్కొన్నారు. మూడు రోజులు విరామం దొరికినా కుటుంబంతో గడపడానికి ప్రాధాన్యత ఇచ్చే ఆయన క్రమశిక్షణ తనకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. రామ్ చరణ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# బన్నీ 'రాకా'లో బాలీవుడ్ బాద్‌షా?




'పుష్ప'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా' సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఇటీవలే విడుదలైన ఫస్ట్‌లుక్‌తో సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసిన చిత్రబృందం ఇప్పుడు ఓ ఆసక్తికరమైన వార్తతో చర్చల్లో నిలిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఓ కీలక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. గతంలో షారుక్ ఖాన్‌తో అట్లీ తీసిన 'జవాన్' చిత్రం భారీ విజయం సాధించింది. వీరిద్దరి మధ్య ఉన్న మంచి అనుబంధం కారణంగానే 'రాకా'లో అతిథి పాత్రకు షారుక్ అంగీకరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రచారానికి ఇది మరింత బలం చేకూరుస్తోంది. అయితే, దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌లో అల్లు అర్జున్ సరికొత్త అవతారంలో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఈ లుక్ కోసం ఆయన రోజూ 3 నుంచి 4 గంటల సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. ఇక హీరోయిన్ విషయంలోనూ పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ప్రధానంగా దీపికా పదుకొణె పేరు బలంగా వినిపిస్తుండగా, రష్మిక మందన్న, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ముంబైలో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా నటీనటుల పూర్తి వివరాలపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ప్రకాష్ రాజ్ వ్యాఖ్యల వివాదం...


# రామాయణంపై చేసిన వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా ఆగ్రహం



ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ ఇటీవల రామాయణం, దేశంలోని సామాజిక పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. ఒక ప్రైవేట్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు హిందూ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకతను రేకెత్తించాయి.రాముడు, లక్ష్మణుడు ఉత్తర భారతం నుంచి వచ్చినవారని, దక్షిణాదిలో ఓ గిరిజనుడైన రావణుడి పొలంలోకి వెళ్లి పండ్లు తిన్నారని, ఆ విషయంపై వివాదం చెలరేగిందని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు రామాయణ గాథను వక్రీకరించేలా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.అదే విధంగా, ఒక మీడియా సమావేశంలో కూడా శ్రీరాముడు ఉత్తర భారతానికి చెందినవారని, రావణుడు దక్షిణ భారత తెగకు చెందినవాడని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమవుతోంది. పురాణ గాథలను తప్పుగా చూపిస్తూ, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని పలువురు విమర్శిస్తున్నారు. మతపరమైన అంశాలపై బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని నెటిజన్లు సూచిస్తున్నారు. ఇక దేశంలోని ప్రస్తుత పరిస్థితులపై కూడా ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని మరింత పెంచాయి. మైనారిటీలు, గిరిజనులు, ముస్లింలపై ప్రమాదం ఉందని ఆయన చేసిన ఆరోపణలు ఆధారరహితమని కొందరు విమర్శిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే పలుచోట్ల పోలీసులకు ఫిర్యాదులు అందాయి. మతపరమైన మనోభావాలను కించపరిచినందుకు, సమాజంలో విద్వేషాలను ప్రేరేపించినందుకు గాను ఆయనపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు సమాచారం. సోషల్ మీడియా వేదికలపై ఆయనను అరెస్ట్ చేయాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తూ, రాజకీయ, సామాజిక వర్గాల్లో పెద్ద ఎత్తున స్పందన రాబడుతున్నాయి.

## కన్నవారికి కర్మలు చేయలేకపోయా...

# పాపం ప్రతాప్ హీరో ఎమోషనల్ కామెంట్స్ వైరల్



టాలీవుడ్ యంగ్ హీరో తిరువీర్ తాజాగా 'పాపం ప్రతాప్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తన సహజమైన నటనతో తిరువీర్ మరోసారి ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తున్నాడు.అయితే ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తిరువీర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక బాధాకర విషయాన్ని ఆయన అభిమానులతో పంచుకున్నారు. సినిమా షూటింగ్ షెడ్యూల్స్, లుక్ కంటిన్యూటీ సమస్యల కారణంగా తన తల్లిదండ్రుల అంత్యక్రియలు, అనంతర కర్మకాండలను సరిగ్గా నిర్వహించలేకపోయానని తిరువీర్ భావోద్వేగంతో చెప్పారు.షూటింగ్ మధ్యలో జుట్టు కత్తిరించడం లేదా లుక్ మార్చడం సాధ్యం కాకపోవడంతో, వృత్తిపరమైన బాధ్యతల కోసం వ్యక్తిగతంగా పెద్ద త్యాగం చేయాల్సి వచ్చిందని వివరించారు. ఈ కారణంగా కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి విమర్శలు కూడా ఎదుర్కొన్నానని ఆయన వెల్లడించారు. ఒక్కడే కొడుకువై ఉండి కనీసం ఈ మాత్రం కూడా చేయలేవా? అని అడిగిన సందర్భాలు తనను మరింత బాధించాయని తెలిపారు. వృత్తి పట్ల ఉన్న అంకితభావం తనను వ్యక్తిగతంగా ఎంతగా కలిచివేసిందో చెబుతూ, ఆ గిల్ట్ జీవితాంతం తనను వెంటాడుతుందని తిరువీర్ పేర్కొన్నారు. బయటకు నటుడిగా నవ్వుతూ కనిపించినా, లోపల ఎన్నోబాధలు, త్యాగాలు ఉంటాయని ఆయన మాటలు స్పష్టం చేశాయి. 'పాపం ప్రతాప్' సినిమా విజయవంతం కావాలని ఆశిస్తూ, తన కష్టానికి తగిన గుర్తింపు రావాలని అభిమానులు కోరు కుంటు న్నారు.

# 16 ఏళ్ల న్యాయపోరాటం.. నటి తమన్నాకు మద్రాస్ హైకోర్టులో భారీ షాక్!



మద్రాస్ హైకోర్టులో ప్రముఖ నటి తమన్నా భాటియాకు భారీ షాక్ తగిలింది. సుమారు 16 ఏళ్లుగా సాగుతున్న సుదీర్ఘ న్యాయ పోరాటంలో చివరకు ఆమెకు చుక్కెదురైంది. గతంలో 'పవర్ సోప్స్' అనే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసిన తమన్నా, తన ఒప్పంద కాలం ముగిసిన తర్వాత కూడా ఆ సంస్థ తన ఫోటోలను ప్రకటనల్లో వాడుకుందని ఆరోపిస్తూ 2011లో కోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా ఫోటోలు వాడినందుకు గాను కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఆమె సివిల్ సూట్ దాఖలు చేశారు.

అయితే ఈ కేసును విచారించిన మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్, తమన్నా ఆరోపణలకు తగిన సాక్ష్యాధారాలు లేవని స్పష్టం చేసింది. ఆమె సమర్పించిన సబ్బు కవర్లు, ఇతర పత్రాలు సదరు సంస్థ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘనకు పాల్పడిందని నిరూపించలేకపోయాయని కోర్టు అభిప్రాయపడింది. గతంలోనే ఒక సింగిల్ జడ్జి ఆమె పిటిషన్‌ను కొట్టివేయగా, దానిని సవాలు చేస్తూ తమన్నా అప్పీల్‌కు వెళ్లారు. తాజాగా జస్టిస్ పి. వేల్మురుగన్, జస్టిస్ కె. గోవిందరాజన్ తిలకవతిలతో కూడిన ధర్మాసనం పాత తీర్పునే సమర్థిస్తూ ఆమె అప్పీల్‌ను పూర్తిగా కొట్టివేసింది. ఈ తీర్పుతో నష్టపరిహారం రాకపోగా, ఇన్నేళ్లుగా సాగిన పోరాటం ఆమెకు నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215